నేడే మండల, జడ్పీటిసి ఎన్నికలకు పోలింగ్

- సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ

సూళ్లూరుపేట, నవంబర్ 4 ప్రభాతవార్త: సూళ్లూరుపేట ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి ప్రక్రియ బుధ వారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా స్థానిక జూనియర్ కళాశాల ఆవరణములో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్లను ఇతర ఎన్నికల సామగ్రిని అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూళ్లూరుపేట మండలానికి సంబంధించి మూడు ఎంపీటీసీలకు, ఒక జడ్పిటిసి స్థానానికి ఎన్నికలు జరుగుతున్నాయి. ఆబాక జడ్పిటిసికి కాంగ్రెస్ అభ్యర్థిగా బొగ్గుల సురేష్,టిడిపి అభ్యర్థిగా చిట్టేటి శివకుమార్, కోటపోలురు ఎంపీటీసీకి వైసిపి తరఫున ముచ్చకాల సందీప్ యాదవ్, టిడిపి తరఫున కైలాసం కిషోర్, దామా నెల్లూరు ఎంపీటీసీకి వైసీపీ తరఫున అక్కిపల్లి చంగమ్మ, టిడిపి తరఫునషేక్ షామియా రంగంలో ఉన్నారు. అలాగే జడ్పిటిసి స్థానానికి బిజెపి తరఫున ఆరణి కిషన్‌రెడ్డి, వైసీపీ తరఫున అల్లూరు రమేష్‌రెడ్డి, ఇండిపెండెంట్‌లుగా దువ్వూరు అశోక్ రెడ్డి, కె.దీపికా రెడ్డిలు రంగంలో ఉన్నారు. మండలంలోని 11907 పురుష ఓటర్లు, 12307 మహిళా ఓటర్లు మొత్తం 24214 ఓట్లు ఉన్నాయి. అలాగే ఎన్నికల నిర్వహణకు 5 రూట్లు, మూడు జోన్లుగా విభజించి 300 మంది సిబ్బందితో ఎన్నికల నిర్వహణను చేపట్టనున్నారు. అలాగే ఎన్నికలకు సంబంధించి పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ఒక డిఎస్పి ఆధ్వర్యంలో సీఐ రామకృష్ణ పర్యవేక్షణలో ఎస్సైలు గంట అజయ్ కుమార్, భాను ప్రసన్నలు, 6 మంది సిబ్బంది ఎన్నికల బందోబస్తులో భాగస్వాములు కానున్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం సూళ్లూరుపేటలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో పోలింగ్ బాక్స్‌లను భద్రపరుస్తారు. అనంతరం శుక్రవారం సూళ్లూరుపేట, దొరవారి సత్రం, తడలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియను చేపట్టేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

తిరుపతి - చిత్తూరు

30 ఏళ్ళ ప్రస్థానం 30 వార్త వార్షికోత్సవం 1996 - 2026

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆ ముగ్గురు... ఎటువైపు మొగ్గు!

-తిరుగుబాటు అభ్యర్థుల పునరాగమనంపై రాజకీయ వర్గాల్లో చర్చ!

-రెబల్స్ కూడా మనవారే...చంద్రబాబు!

ప్రభాతవార్త-తిరుపతి:

తిరుపతి నగరపాలకసంస్థ కౌన్సిల్ ఎన్నికల్లో టిక్కెట్ ఆశించిన పార్టీని నమ్ముకున్న అభ్యర్థులకు గాక కూటమి ధర్మం అంటూ టిక్కెట్లు ఇతర పార్టీలకు ఇవ్వడంతో రెబల్స్‌గా మారారు.ఈ రెబల్స్ 12మంది వరకు తిరుపతి కార్పొరేషన్‌లో పోటీచేయగా ముగ్గురు మాత్రమే స్వతంత్రులుగా గెలిచారు. వీరి చూపు ఎటువైపు అనేది ఇప్పుడు తిరుపతి జనంలో చర్చనీయాంశంగా మారింది. అదేగాక మున్సిపల్ ఎన్నికల్లో తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేసి విజయం సాధించిన కూటమి నేతలు తిరిగి తమ పార్టీల్లో చేరుతారా అనే చర్చకు ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బుధవారం పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో తిరుగుబాటు అభ్యర్థులుగా గెలిచిన వారు కూడా మనవారేనని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది.

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో 87 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు రెబల్స్‌గా పోటీ చేసి విజయం సాధించారు. వీరిలో నెల్లిమర్ల, సాలూరు మున్సిపల్ చైర్మన్లుగా ఎన్నికైనవారు కూడా ఉన్నారు. పార్టీ నిర్ణయాలను ధిక్కరించి పోటీ చేసిన కొందరిపై టిడిపి సస్పెన్షన్ వేటు వేయగా, జనసేన పార్టీ మరికొందరికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు రెబల్స్ భవిష్యత్తుపై ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

-తిరుపతిలో ముగ్గురు రెబల్స్ విజయం:

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ ముగ్గురు కూటమి నేతలు తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేసి విజయం సాధించారు. టిడిపికి చెందిన దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి 21వ వార్డులో బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్‌పై పోటీ చేసి గెలుపొందారు. జనసేనకు చెందిన తలారి రేవతి 27వ వార్డు నుండి, ఆదం సుధాకర్ రెడ్డి 60వ వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగి విజయం సాధించారు.

చంద్రబాబు వ్యాఖ్యల నేపథ్యంలో ఈ ముగ్గురిని తిరిగి పార్టీల్లో చేర్చుకుంటారా? పార్టీలు వారిపై విధించిన క్రమశిక్షణ చర్యలను ఉపసంహరిస్తాయా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే, వారిని తిరిగి పార్టీల్లో చేర్చుకునే అంశంపై అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది. తిరుపతి కార్పొరేషన్‌లో మొత్తం 66 వార్డులకు జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 60 స్థానాల్లో విజయం సాధించారు. మరో మూడు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసిన రెబల్స్ గెలవగా, వైసిపి మూడు స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో తిరుపతి రాజకీయాల్లో రెబల్స్ పాత్ర, వారి తదుపరి అడుగులపై ఆసక్తి నెలకొంది.

-పాత కార్పొరేటర్లలో ఐదుగురికి మళ్లీ విజయం:

2021లో తిరుపతిలో కార్పొరేటర్లుగా పనిచేసిన ఐదుగురు నాయకులు ఈ ఎన్నికల్లో తిరిగి విజయం సాధించడం విశేషం. వారిలోఆర్‌సి మునికృష్ణ గతంలో టిడిపి తరఫున గెలుపొందగా ఇప్పుడూ ఆ పార్టీనుండే 47వార్డు కార్పొరేటర్‌గా గెలిచారు. ఆదం సుధాకర్ రెడ్డి, సి. రేవతి, సి. శైలజ గతంలో వైసిపి నుండి విజయం సాధించారు. ఆర్. వెంకటేశ్వర్లు గతంలోనూ, ఈసారి కూడా వైసిపి కార్పొరేటర్‌గానే 26వవార్డు నుండి గెలుపొందారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం పార్టీ క్రమశిక్షణ, రాజకీయ సమీకరణాలు, గెలిచిన రెబల్స్ పునరాగమనం వంటి అంశాలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశాలుగా మారాయి. చంద్రబాబు వ్యాఖ్యల నేపథ్యంలో రెబల్స్ విషయంలో పార్టీలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయన్నది వేచి చూడాలి.

సర్వం సిద్ధం

- నేడు 24 జడ్పీటిసీ, 300 ఎంపిటిసీ స్థానాలకు ఎన్నికల పోలింగ్

- ఉదయం 7 గంటల నుండి ప్రారంభం

యాదమరిలోని పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రంలో జిల్లా అధికారులు

చిత్తూరు, నవంబర్ 4 ప్రభాతవార్త: జిల్లాలో 24 జడ్పీటిసీ, 300 ఎంపిటిసీ స్థానాలకు గురువారం పోలింగ్ నిర్వహించడానికి ఎన్నికల యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. గురువారం ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రారంభించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా గురువారం జడ్పీటిసీ, ఎంపిటిసీ ఎన్నికల పోలింగ్ జరుగనుండటంతో ఎన్నికల యంత్రాంగం బుధవారం పలు ప్రదేశాల్లో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసి సిబ్బందికి ఎన్నికల పోలింగ్‌కు అవసరమైన సామాగ్రిని అందజేసింది. ఎన్నికల పోలింగ్ సామాగ్రి తీసుకున్న పోలింగ్ అధికారులు వారికి నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు బుధవారం సాయంత్రంకు చేరుకుని గురువారం తెల్లవారుజాము పోలింగ్ సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేపట్టనున్నారు. జిల్లాలో మొత్తం 27 జడ్పీటిసీ స్థానాలు వుండగా ఇందులో ఇప్పటికే మూడు జడ్పీటిసీ స్థానాలను తెలుగుదేశం పార్టీ ఏకగ్రీవంగా చేజిక్కించుకుంది. ప్రస్తుతం 24 జడ్పీటిసీ స్థానాలకు గురువారం ఎన్నికల పోలింగ్ జరుగనుంది. ఈ 24 జడ్పీటిసీ స్థానాల కోసం 89 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచి పోరాడుతున్నారు. అలాగే జిల్లాలో 370 ఎంపిటిసీ స్థానాలు వుండగా ఇందులో 70 ఎంపిటిసీ స్థానాలు ఇప్పటికే ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 300 ఎంపిటిసీ స్థానాలకు గురువారం పోలింగ్ జరుగనుండగా ఈ స్థానాల్లో విజయం సాధించడానికి వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్రులు 702 మంది ఎన్నికల బరిలో నిలిచి పోరాడుతున్నారు. ఈ పోలింగ్‌కు సంబంధించి జిల్లాలో 10,26,821 మంది ఓటర్లు వుండగా ఇందులో 5,07,703 మంది పురుష ఓటర్లు, 5,19,091 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 27 మంది ఓటర్లు వున్నారు. వీరి కోసం 1,138 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో 306 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 321 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 228 పోలింగ్ కేంద్రాలకు వెబ్ కాస్టింగ్ సౌకర్యం కల్పించబడిన పోలింగ్ కేంద్రాలు వున్నాయి. ఈ ఎన్నికల పోలింగ్‌కు 27 మంది రిటర్నింగ్ అధికారులు, 54 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 1,366 మంది ప్రిసైడింగ్ అధికారులు, 6,828 మంది ఇతర పోలింగ్ సిబ్బంది, 105 మంది జోనల్ అధికారులు, 257 మంది మైక్రో అబ్జర్వర్లు విధులకు హాజరు కానున్నారు. ఎన్నికల పోలింగ్ విధులకు 234 వాహనాలు కేటాయించగా 27 పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాల నుండి ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా పోలింగ్ సిబ్బంది తమ పోలింగ్ సామాగ్రిని సిద్ధం చేసుకుని పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్ళారు. ఎన్నికల పోలింగ్‌లో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 1,618 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. వీరిలో 6 మంది డిఎస్పీలు, 28 మంది సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, 48 మంది ఎస్ఐలు, 351 మంది కానిస్టేబుళ్ళు, 1,185 మంది ఇతర పోలీసు సిబ్బంది వున్నారు.

వేద విజ్ఞాన పరిశోధనలకు ప్రత్యేక కేంద్రం

-ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో పరిశోధనా కేంద్రం ప్రారంభం

తిరుపతి విద్య, నవంబర్ 4 ప్రభాతవార్త: భారతీయ వేద విజ్ఞానాన్ని ఆధునిక పరిశోధనలతో అనుసంధానించే దిశగా శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో ప్రత్యేక పరిశోధనా కేంద్రం ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన ఈ కేంద్రాన్ని బుధవారం విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాణం, జీవన విధానంపై వేద దృక్పథాన్ని వివరించే పరిశోధనా గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉపకులపతి ఆచార్య కె. గణపతి భట్ మాట్లాడుతూ, వేద విశ్వవిద్యాలయమే ఒక సమగ్ర భారతీయ జ్ఞాన పరిశోధనా కేంద్రంగా పనిచేస్తోందన్నారు. వైదిక విద్యలను లోతుగా, శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేసే వారికి ప్రోత్సాహం అందించడమే ఈ కేంద్రం లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఉపకులపతి ఆచార్య కె.ఇ. దేవనాథన్ మాట్లాడుతూ, వేదాధారిత భారతీయ జ్ఞాన పరంపర ప్రపంచంలోనే అత్యున్నతమైనదని కొనియాడారు.విశ్వవిద్యాలయ పరిశోధన, ప్రచురణల విభాగం డైరెక్టర్, కేంద్ర ప్రధాన పరిశోధకుడు ప్రొఫెసర్ ఎ. వెంకట రాధేశ్యామ్ కేంద్రం లక్ష్యాలను వివరించారు. యువతలో మానసిక ఆందోళనలను అధిగమించేందుకు, నైతిక విలువలను పెంపొందించేందుకు వినోదాత్మక విద్యా, భాషాశాస్త్ర విభాగాల్లో ప్రత్యేక ధ్రువపత్ర కోర్సులు, పరిశోధనలు చేపట్టనున్నట్లు తెలిపారు. గతంలో పరిశోధనా ప్రాజెక్టును పూర్తి చేసి, స్వతంత్ర పరిశోధనా కేంద్రంతో పాటు మరో నూతన ప్రాజెక్టును సాధించిన ఆయన కృషిని అతిథులు అభినందించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాధేశ్యామ్ రచించిన ప్రాణం, జీవితం ఆత్మహత్య ఆలోచనలను తగ్గించడంలో వేద దృక్పథాలు అనే పరిశోధనా గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీన్ డా. తారక రామకుమార శర్మ, రిజిస్ట్రార్ డా. బలభద్ర ఉపాధ్యాయ, ఆర్థిక అధికారి శ్రీలక్ష్మి, ప్రజాసంబంధాల అధికారి డా. గంజాం రామకృష్ణ, ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికలకు... చకా చకా ఏర్పాట్లు

స్పెషల్ ఆఫీసర్ పర్యవేక్షణలో కసరత్తు

శ్రీకాళహస్తి పట్టణ దృశ్యం

శ్రీకాళహస్తి,నవంబర్ 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మునిస్సిపల్ ఎన్నికలకు చక చకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి ఆర్‌డిఓ,మున్సిపల్ స్పెషల్‌ఆ ఫీసర్ భానుప్రకాష్‌రెడ్డి పర్యవేక్షణలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఎన్నికల తతంగాన్ని యుద్ధ ప్రాతిపదికపై నిర్వహిస్తున్నారు. 2020లో జరగాల్సిన ఎన్నికలు డీలిమిటేషన్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించలేదనే కోర్టు వ్యాజ్యంతో ఆగింది. ఆ నాడు ఈ సమస్యను కోర్టుకు నివేదించి ఎన్నికలు జరపపాల్సిన వైకాపా ప్రభుత్వం నాయకులు అధికారం తమ చేతిలో కేంద్రీకృతమై ఉంటుందనే భావంతో నిర్వహించలేదు. వారి పాపం మున్సిపాలిటి అభివృద్ధికి శాపంగా మారింది. ఐదేళ్ళ పాటు మున్సిపాలిటికి రావాల్సిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రణాళిక నిధులను మున్సిపాలిటి కోల్పోయింది. ఈ కేసులను పరిష్కరించటంలో కూటమి కీలకంగా వ్యవహరిం చింది. అంతేకాక స్థానికంగా గెలిచిన కూటమి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఇకూడా ప్రత్యేక దృష్టి సారించారు. కోర్టులో వేసిన కేసులను ఉపసంహరించు కోజేసారు. దాంతో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. అయితే మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ జారి అయిన తరువాత కోర్టు తీర్పు రావటంతో మూడవదశలో ఎన్నికలు నిర్వహిస్తామంటూ ఎన్నికల కమిషన్ ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఏర్పాట్లుకు సంబంధించి ఆదేశించింది.

కొత్త నిబంధనలతో డీలిమిటేషన్:

ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా డీలిమిటేషన్‌కు ఎన్నికల కమిషన్ ఆదేశించిన మేరకు చట్టపరిధిలో భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుడా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. కొత్త నిబంధనల మేరకు డీలిమిటేషన్‌కు సంబంధించిన ప్రసకటనను జారి చేసారు.అభ్యంతరాలు స్వీకరించారు. తరువాత గతంలో ఉన్న 35 వార్డుల స్థానంలో 44 వార్డులుగా విభజించారు. కొత్తగా చేర్చుకున్న ప్రాంతాలతో వార్డులలో ఓటర్లను పొందుపరచారు.ఒక్కొక్క వార్డులో 1600 మంది ఓటర్లకు మించకుండా చర్యలు తీసుకున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రత్యేకాధికారి భానుప్రకాష్‌రెడ్డి ఆదేశాలు,సూచనలతో కమిషనర్ కృష్ణారెడ్డి తన సిబ్బందితో ఎన్నికల ప్రక్రియను చక చకా సాగించారు. వార్డుల విభజన తరువాత జనాభా వివరాలను కేటగిరిల వారిగా ప్రకటించారు. అలాగే వార్డుల 'రిజర్వేషన్లను' ప్రకటించారు.

త్వరలో నోటిఫికేషన్ జారి అయ్యే అవకాశం:

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో 2014 తరువాత ఎన్నికలు జరగలేదు. దాంతో 2019 నుంచి ప్రత్యేకాధికారుల పాలనలోనే పరిపాలన సాగుతుంది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి అన్ని మున్సిపాలిటిల్లో పాలకవర్గాలు ఉండాలనే మహోన్నత లక్ష్యంతో ఆదేశించారు.ఈ నేపథ్యంలో రెండవ దశలో శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికలు జరగవచ్చుననే భావంతో అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. 44 వార్డులకు 88 పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేసారు.అయితే 44 వార్డులను నాలుగు డివిజన్లుగా విభజించారు. అలాగే నామినేషన్లు ఒకే చోట కాకుండా నాలుగుడివిజన్లలో స్వీకరించేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు.రద్దీ ఉండదని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఉండదనే భావంతో ప్రతిపాదనలు పంపారు.ఈ నేపథ్యంలో పురుష ఓటర్లు 34863మహిళా ఓటర్లు 37670 తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారు.పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. వార్డుల్లో కూడా సగభాగం మహిళలకు కేటాయించారు.

మహిళా ఓటర్లే అధికం:

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో కూడా మహిళా ఓటర్లే అధికం. పురుషుల కన్నా మహిళా ఓటర్లు సుమారు 3వేలు పై చిలుకు అధికం. ఏ వార్డులో అయినా మహిళా ఓటర్ల దయపైనే గెలుపు అధారపడి ఉందని చెప్పవచ్చు.ఎన్నికల కమిషన్ డిసెంబర్ 3లోపల స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికల 'నోటిఫికేషన్' మరో వారం రోజుల్లో జారి కావచ్చునని భావించి అధికారులు పరుగులు తీస్తూ ఏర్పాట్లులో తలమునకలై ఉన్నారు.

వైద్య విద్యలో నాణ్యతతోనే... సమర్థులైన వైద్యుల తయారీ

- స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా॥గూడారు జగదీష్

స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో రెండు రోజుల జాతీయ వైద్య కమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తిరుపతి హెల్త్, నవంబర్ 4 ప్రభాతవార్త: వైద్య విద్య కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకూడదని, ఆచరణాత్మక నైపుణ్యాలు, మానవీయ విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలివైద్య విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకంవైద్య విద్యలో నూతన బోధనా విధానాలు, క్లినికల్ నైపుణ్యాలు, నిరంతర మూల్యాంకనం తప్పనిసరిరోగికి చికిత్స అందించడమే కాదని, మానవత్వం, నైతికత, సానుభూతితో సేవలందించే వైద్యులను తయారు చేయాలని, స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో రెండు రోజుల జాతీయ వైద్య కమిషన్ సిఐఎస్‌పి - 3, శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. వైద్య విద్యలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పడం ద్వారా వైద్య పరిజ్ఞానంతో పాటు ఆచరణాత్మక నైపుణ్యాలు, నైతిక విలువలు, మానవీయ దృక్పథం కలిగిన సమర్థులైన వైద్యులను సమాజానికి అందించగలమని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సంచాలకులు, ఉపకులపతి డా. గూడారు జగదీష్ పేర్కొన్నారు. బుధవారం స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నవంబర్ 4, 5 తేదీలలో నిర్వహిస్తున్న రెండు రోజుల కరికులం ఇంప్లిమెంటేషన్ సపోర్ట్ ప్రోగ్రామ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా డా. గూడారు జగదీష్ మాట్లాడుతూ ఆధునిక వైద్య రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా వైద్య విద్యాబోధనలో కూడా గణనీయమైన మార్పులు అవసరమని తెలిపారు. వైద్య విద్యలో సంస్కరణలు కేవలం రికార్డులు, పత్రాలకే పరిమితం కాకూడదు. వాటి ఫలితాలు విద్యార్థుల జ్ఞానం, వైద్య నైపుణ్యం, వృత్తిపరమైన ప్రవర్తన, రోగులకు అందించే సేవల నాణ్యతలో స్పష్టంగా కనిపించాలి అని పేర్కొన్నారు. చివరగా, ఉత్తమ అధ్యాపకులు ఉత్తమ వైద్యులను తయారు చేస్తారు. ఉత్తమ వైద్యులు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తారు. నాణ్యమైన వైద్య సేవలే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పునాది అని డా. గూడారు జగదీష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉమామహేశ్వరరావు, డీన్ డా. అలోక్ సచాన్, రిజిస్ట్రార్ డా. అపర్ణ ఆర్. బిట్లా, మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. శిల్ప, వైస్ ప్రిన్సిపాళ్లు, విలీది కోఆర్డినేటర్లు, మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ సభ్యులు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో తుఫాన్ వేళ...

శ్రమిస్తున్న విద్యుత్ యంత్రాంగం

-విద్యుత్ పునరుద్ధరణకు శివశంకర్ లోతేటి విశేష కృషి

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ చర్యలపై మాట్లాడుతున్న సిఎండి

తిరుపతి,నవంబర్ 4ప్రభాతవార్త: రాష్ట్రంలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో ఆర్నాబ్ తుఫాను సృష్టించిన ప్రతికూల పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ఇతర విద్యుత్ సంస్థల అధికారులు, సిబ్బందితోపాటు ఎస్పీడిసిఎల్ యంత్రాంగం అహర్నిశలు శ్రమిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ల ఆదేశాలకు అనుగుణంగా పశ్చిమగోదావరి జిల్లాలో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించేందుకు ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి కీలక పాత్ర పోషిస్తున్నారు. జిల్లా ప్రత్యేక పర్యవేక్షకుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేస్తున్నారు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు శివశంకర్ లోతేటి ప్రత్యేక దృష్టి సారించారు. రాత్రింబవళ్లు అధికారులతో సమీక్షలు జరుపుతూ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కార చర్యలకు మార్గనిర్దేశం చేస్తున్నారు. స్థానిక యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ప్రాధాన్యతనిస్తున్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయం పెంపొందించడం ద్వారా పనుల్లో జాప్యం లేకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు అవకాశం ఏర్పడుతోంది. పునరుద్ధరణ పనుల కోసం ఎస్పీడిసిఎల్ భారీ స్థాయిలో మానవ వనరులను సమీకరించింది. డైరెక్టర్, చీఫ్ జనరల్ మేనేజర్లు, జనరల్ మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో బాటు 2 వేల మందికి పైగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఈ బృహత్తర కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు. సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సైతం వారం రోజులుగా పశ్చిమగోదావరి జిల్లాలోనే ఉంటూ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితుల్ని అంచనా వేస్తూ, అందుకు తగ్గట్టుగా అధికారులు సిబ్బందికి సూచనలు, సలహాలు ఇస్తూ పనులను వేగంగా పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తున్నారు.

5 CTR 2:5 CTR 2.qxd 11/4/2026 11:35 PM Page 1

నేడే పల్లె పోరు...ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఉదయం 7గంటల నుంచి పోలింగ్,గ్రామాల్లో సందడి
- 54ఎంపిటిసి సెగ్మెంట్లలో ఎన్నికలు

కుప్పం, నవంబర్ 4 ప్రభాతవార్త:

కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గురువారం పల్లెపోరు జరగనుంది. ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగం ఏర్పాట్లను సర్వ ం సిద్ధం చేశారు. కుప్పం నియోజకవర్గంలోని కుప్పం గ్రామీణ మండలం, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో 54 ఎంపిటిసి సెగె ్మంట్లకు ఎన్నికలు జరుగుతాయి. అలాగే నాలుగు మండలాలకు సంబంధించి జడ్పీటిసి ఎన్నిక నిర్వహిస్తారు. కుప్పం మండలంలో 21 ఎంపిటిసి సెగ్మెంట్లు, గుడుపల్లె మండలంలో 13, శాంతిపురంలో 18 సెగ్మెంట్లు, రామకుప్పంలో 2 సెగ్మెంట్లలో మాత్రమే ఎంపిటిసి ఎన్నికలు జరుగుతాయి. రామకుప్పంలో ఇప్పటికే 14 ఎంపిటిసి సెగ్మెంట్లు ఏక గ్రీవం అయ్యాయి. కుప్పం మండలంలో 66 పోలింగ్ కేంద్రాలు, గుడుపల్లెలో 45 పోలింగ్ కేంద్రాలు, శాంతిపురంలో 57 పోలింగ్ కేంద్రాలు, రామకుప్పంలో 57 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1,88887 మంది ఓటర్లు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన సామ గ్రి :

పరిషత్ ఎన్నికలకు సంబంధించి బుధవారం నాలుగు మండలాల్లో ఆర్డీఒ షేక్ మహ్మద్ హుసేన్ అధ్వర్యంలో ఆర్వోలు, ఎఆర్ ్వలు పోలింగ్ సిబ్బందికి ఎన్నికల బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. గట్టి పోలీసు భద్రత మధ్య ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రిని ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

గ్రామాల్లో ఎన్నికల సందడి :

పరిషత్ ఎన్నికల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఉపాధి కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారంతా తమ సొంత ఊళ్లకు చేరుకుంటున్నారు. కాగా గురువారం ఉదయం 7గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు పోలి ంగ్ జరుగుతుంది.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

ఎంపిటిసి ఎన్నికల బరిలో 140 మంది

కుప్పం, నవంబర్ 4 ప్రభాతవార్త: కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని 54 ఎంపిటిసి సెగ్మెంట్లలో 140మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కుప్పం మండలంలో 58మంది, గుడుపల్లెలో 32మంది, శాంతిపురం మండలంలో 46మంది, రామకుప్పం మండలంలో 4మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కుప్పం మండలంలో 58మంది అభ్యర్థుల్లో తెదేపా 20మంది, వైకాపా 21, బిజెపి 1, జనసేన 1, స్వతంత్ర అభ్యర్థులు 15మంది బరిలో ఉన్నారు. ప్రధాన పోటీ తెదేపా, వైకాపాల మధ ్యనే నియోజకవర్గంలో ఉండబోతోంది.

జడ్పీటిసి అభ్యర్థులు వీరే

కుప్పం, నవంబర్ 4 ప్రభాతవార్త:

కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జడ్పీటిసి సెగ్మెంట్లకు పోటీ చేస్తున్న అభ్యర్థుల వివరాలిలా.. కుప్పం మండలంనుంచి తెదేపా తరపున స్వాతి రాజగోపాల్, వైకాపా తరపున హెచ్ఎం వనిత శ్రీను బరిలో ఉన్నారు. శాంతిపురం మండలం నుంచి తెదేపా తరపున జనార్ధనరెడ్డి, వైకాపా తరపున చక్రపాణిరెడ్డి, కాంగ్రెస్ తరపున కేశవరాజు పోటీలో ఉన్నారు. గుడుపల్లె మండలంలో తెదేపా తరపున మంజుప్రియ వెంకటేష్, వైకాపా తరపున లావణ్య దేవప్పనాయుడు ఉన్నారు. రామకుప్పం మండలంలో తెదేపా తరపున బుజ్జమ్మ కృష్ణానాయక్, వైకాపా తరపున అముద మోహన్ నాయక్ బరిలో ఉన్నారు. కాగా కుప్పం, గుడుపల్లె జడ్పీటిసి స్థానాలు బిసి మహిళలకు రిజర్వు కాగా రామకుప్పం మండలంలో ఎస్టీ మహిళకు రిజరు ్వ అయింది. శాంతిపురం సెగ్మెంట్ జనరల్ కేటగిరీకి రిజర్వు అయింది.

ఎంపిటిసీ స్థానాల ఎన్నికలకు సిద్ధం

బంగారుపాళ్యం, నవంబర్ 4 ప్రభాతవార్త:

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గురువారం జరుగనున్న ఎంపిటిసీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండల పరిధిలోని 21 ఎంపిటిసీ స్థానాల్లో 10 ఎంపిటిసీ స్థానాలు ఏకగ్రీవం కాగా అందులో 8 తెలుగుదేశం, 2 జనసేన అభ్యర్థులు వున్నారు. మిగిలిన 11 ఎంపిటిసీ స్థానాలకు గాను 38 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారిణి లక్ష్మీ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని అందజేసి 8 రూట్లలో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. మండల పరిధిలో 33,195 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 16,823 మహిళలు కాగా 16,311 మంది పురుష ఓటర్లు వున్నారు. అలాగే పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు చెప్పారు.

కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టం: జిల్లా అధ్యక్షుడు

పలమనేరు, నవంబర్ 4 ప్రభాతవార్త:

మున్సిపల్ ఎన్నికలలో వైసీపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులను కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసిన వారిని ఉరికే వదిలిపెట్టమని జిల్లా వైసీపీ అధ్యక్షుడు పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకట గౌడ హెచ్చరించారు బుధ వారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ కు ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారం లోచేతిలో ఉంటే కుక్క కూడా పులిలాగా అవుతుందనీ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు నిరూపిం చారని ఆరోపించారు. ఎన్నికలు ఏకపక్షంగా జరగాలని ఎన్నో కుయుక్తులు పన్నారని నామినేషన్ల నుండి వైసీపీ అభ్యర్థులకు బెదిరింపులు ప్రారంభమ య్యాయని ఆరోపించారు. కొందరు అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా ప్రలోభాలకు గురి చేశారని తెలిపారు ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజమని అయితే ప్రజాస్వామ్యాన్ని కూని చేసి దొడ్డిదారిన ఎన్నికలలో గెలుపొందడం దారుణం అన్నారు. మున్సిపల్ చైర్మన్ పదవికి పోటీ చేసిన శ్రీలక్ష్మి కూడా ఇబ్బందులకు గురిచేశారని అలాగే ఎన్నికల్లో పోటీ చేసిన మైనారిటీ మహిళను కూడా అవమానకరంగా మాట్లాడాలని ఆరోపించారు ఎన్నికల కౌంటింగ్ లోనూ అధికారులు అధికార పార్టీకి వంత పలుకుతూ గెలుపు ఓటములను ప్రభావితం చేశారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలలో ఒక పలమనేరులోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా కూడా ఇదే విధానం కొనసాగిందని ఆరోపించారు మున్సిపల్ ఎన్నికలలో గెలుపును చూసి వాపుగా భావించవద్దని ముందుంది ముసళ్ళ పండుగ అని హెచ్చరించారు వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో వైసిపి రాష్ట్రవ్యాప్తంగా విజయభేరి మోగించి అధికారంలోకి రావడం ఖాయమని హెచ్చరించారు. అధికారం శాశ్వతం కాదని అధికార పార్టీ నాయకులు గుర్తించాలని సూచించారు

కుప్పం మండలంలో 58363మంది ఓటర్లు

కుప్పం, నవంబర్ 4 ప్రభాతవార్త:

కుప్పం గ్రామీణ మండలంలో 21 ఎంపిటిసి సెగ్మెంట్లకు సంబంధించి 58363మంది ఓటర్లు ఉన్నట్లు ఆర్వో నరసింహ నాయుడు, ఎఆర్వో రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. పురుషులు 29355 మంది, మహిళలు 29000, ఇతరులు 8మంది ఓటర్లుగా ఉన్నారన్నారు. కుప్పం మండలంలో ఎన్నికల నిర్వహణకు గాను 66 పోలి ంగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో అడవిబూదుగూరు, చెక్కనత్తం, దాసేగానూరు, గరిగచీనేపల్లి, జరుగు, కంగుంది 1,2,3, కొటాలూరు, కెడిపల్లి, మల్లానూరు 1,2,3, మ ంకలదొడ్డి, మిట్టపల్లి, నడిమూరు, నూలుకుంట, పైపాళ్యం, పిబి నత్తం, ఉర్ల ఓబసపల్లి, వెందుగంపల్లి సెగ్మెంట్లలో ఎన్నికలు జరుగుతాయన్నారు.

మాకు ప్రాణహాని ఉంది...రక్షణ కల్పించండి

-పోలింగ్ బూత్‌లలో మా ఏజెంట్లకు భద్రత ఇవ్వండి
-తొట్టంబేడు పోటీలో ఉన్న అభ్యర్థుల మొర

తొట్టంబేడు,నవంబర్ 4 ప్రభాతవార్త:

తొట్టంబేడు మండలంలోని జిల్లా ప్రాదేశికం ఆరు ఎంపిటిసి స్థానాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రచారాలు ముగిసాయి. ఓ వైపు పంపకాలు ఇరు పార్టీలు మాట్లాడుకున్నట్లు ఓటుకు రూ.500ల చొప్పున పంపిణి చేసుకున్నారు.అయితే అధికార పార్టీ నాయకులు కొందరు తమ సొంత సొమ్ములతో ఒక్కొక్క చోట రూ.1000 పంపిణి చేసారు. ఈ నేపధ్యంలో బుధవారం జిల్లా ప్రాదేశికం నుంచి వైకాపా పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఉన్నం వాసుదేవనాయుడు, ఆ పార్టీ ఎంపిటిసి అభ్యర్థులు కోగిల సుబ్రమణ్యం (తాడిపర్తి), వల్లం కౌశల్య(పూడి) టి. చెంచయ్య(పొయ్య)సి.రజని(కాసరం),పి, రేవతి(పెద్ద కనపర్తి) అభ్యర్థులు జిల్లా కలెక్టర్,ఎస్పిలకు తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ నేపధ్యంలో ఉన్నం వాసుదేవనాయుడు మాట్లాడుతూ ఎన్నికలంటూ సజావుగా సాగల్సి ఉందని అయితే నామినేషన్ల రోజునుంచే తమకు అధికార పార్టీనుంచి ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేసారు. నామినేషన్ల సందర్భంగా తాను అనుకొని కారుపై దాడి చేసిన సంఘటన మీకు తెలియనిది కాదు.తాము అతికష్టం మీద నామినేషన్లు దాఖలు చేసినట్లు వివరించారు. తమ ఏజెంట్లను పోలింగ్‌కేంద్రాలలోకి రానివ్వమని వస్తే చంపేస్తా మంటూ హెచ్చరిస్తున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ ఎత్తున గుమిగూడి అవాంతరం కల్పిస్తారనే సమాచారం తమకు ఉందన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీసుశాఖ ఎస్పి డివిజన్లోని పోలీసు అధికారులను కోరారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అధికారులు సహకరించి తమకు రక్షణతో పాటు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి ప్రజాతీర్పును శిరసావహించాలని కోరారు.

మహిళ మెడలోంచి చైన్ లాక్కెళ్లారు

కుప్పం, నవంబర్ 4 ప్రభాతవార్త:

మార్కెట్‌కు వెళ్లి కుమార్తె ఇంటికి వస్తున్న ఓ మహిళ మెడలోంచి గుర్తు తెలియని దుండగులు టువీలర్‌లో వచ్చి మెడలోని బంగారు చైను లాక్కెళ్లిన సంఘటన బుధవారం పట్ట ణంలోని హెచ్‌పి రోడ్డులో చోటు చేసుకుంది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసిన మేరకు వివరాలిలా.. పట్టణంలోని హెచ్‌పి రోడ్డులో శోభన అనే మహిళ నివాసం ఉంటోంది. ఈమె తల్లి జయంతి బుధవారం ఉదయం మార్కెట్‌కు వెళ్లి మరలా ఇంటికి నడుకుచుకుని వస్తుండగా సాయిబాబా గుడికి వెళ్లే రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తులు ముసుగులు ధరించి టువీలర్‌లో వచ్చి జయంతి మెడలోని సుమారు 24గ్రాముల బంగారుచైనును లాక్కెళ్లారని పేర్కొన్నారు. దీ ంతో జయంతి బిగ్గరగా అరుపులు కేకలు వేయగా ఓ వ్యక్తి వెంటనే దుండగులను వెంబడించగా దుండగులు టువీలర్‌లో అతివేగంగా వెళ్లిపోయారన్నారు. ఈ మేరకు జయంతి కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చక్కటి రోడ్డు...మురుగునీటితో అవస్థలు

అధికారులూ స్పందించండి:

శ్రీకాళహస్తి,నవంబర్ 4 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తీశ్వరాలయం, పాలకులు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం సుమారు రూ.30కోట్లతో శివం టు శివం రోడ్డును స్వర్ణముఖి నదీ తీరాన నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణం సందర్భంగా పట్టిలవారి సందు వీధిలో మున్సిపల్ డ్రైనేజ్ వ్యవస్థ బాగా దెబ్బతిన్నది. ఈ సమస్యను వార్డు ప్రజలు ఎన్నో సార్లు మొరబెట్టుకున్నా పట్టించుకోలేదని వాపోతున్నారు. శివం టు శివం రోడ్డు పక్కన నుంచి స్వర్ణముఖి నది ఒడ్డున డ్రైనేజ్ పైప్‌లైన్ ఉండేది అందులో ఈ ప్రాంతం మురుగు నీరు కూడా కలిసేది. వీధుల్లో మురుగునీరు కనబడేది కాదు. ప్రస్తుతం మురుగునీరు బయటకు వెళ్ళటానికి సరైన ఏర్పాటు చేయలేదని దాంతో ఇళ్ళలో మురుగునీరు రోడ్డుపై నలబడి దుర్గంధం వెదజల్లుతుందని దోమల ఉత్పత్తికేంద్రంగా మారిందని వాపోతున్నారు. ఇక అసలే ఇరుకు దారి అందులో రోడ్డుపైనే మురుగునీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ద్విచక్రవాహనాలే కాకుండా పాదచారులకు కూడా తిప్పలు తప్పటం లేదని ఈ ప్రాంత నివాసులు తెలిపారు.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగునీరు బయటకు పంపేందుకు కాలువను నిర్మించాలని కోరుతున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా...ఇరుపార్టీల పంపకాలు!

తొట్టంబేడు,నవంబర్ 4 ప్రభాతవార్త:

తొట్టంబేడు మండలంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎ న్నికల్లో భాగంగా గురువారం ఆరు ఎంపిటిసి స్థానాలకు ఒక జిల్లా ప్రాదేశికానికి పోలింగ్ జరగనుంది. ఈ నేపధ్యంలో బుధవారం ఇరు పార్టీలు మాట్లాడుకున్నట్లు జడ్‌పిటిసి అభ్యర్థి ఓటుకు రూ.500ల చొప్పున పంపిణి చేసినట్లు సమాచారం. కాగా ఎంపిటిసి ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో వారి ఓటుకు రూ.300ల చొప్పున పంపిణి చేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే ఎక్కడా రచ్చలు ఎదుర్కొనటాలు లేకుండా ఓటర్లకు చక్కగా తాము ఇవ్వదలచుకున్నది అందించారు. అయితే కూటమిలో మాత్రం స్థానిక నాయకులు రూ.వెయ్యి పంపిణి చేసినట్లు ఓటర్లు చర్చించుకుంటున్నారు. మండలంలో మహిళా ఓటర్లు 15,773 మంది ఉండగా పురుష ఓటర్లు 14,746 మంది ఉన్నారు. గురువారం జరిగే ఎన్నికల పోలింగ్‌ను ఎవరు ఎంత మాత్రం ఉపయోగించుకుంటారో అని రాజకీయ పరిశీలకులు చర్చించుకుంటున్నారు. ఎన్నికలకు సంబంధించి వైకాపా వారు అధికార పార్టీ ఆగడాలు సృష్టిస్తాయని భావిస్తు ముందస్తుగా అధికారులను రక్షణ కోరారు. అయితే మంగళవారమే పోలీసులు పట్టణానికి చెందిన పలువురికి నోటీసులు అందించారు. అయితే ఇరు పార్టీల నాయకులు తమ ఓటర్లుకు దండం పెట్టి 'ఓటుకు నోటు తమ శక్తి కొద్ది అందించారు. మరి ఓటరన్న ఎవరిని బలపరుస్తారో వేచి చూడాలి.

ఎన్నికలకు పటిష్ట పోలీస్ బందోబస్తు!

- తిరుపతి జిల్లావ్యాప్తంగా భద్రతా ఏర్పాట్లు పూర్తి
- సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా
- డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ
- అక్రమ మద్యం, నగదు పంపిణీపై ఉక్కుపాదం
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి, నవంబర్ 4 ప్రభాతవార్త: జిల్లాలో గురువారం జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జిల్లావ్యాప్తంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతిలోని ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌తో కలిసి బుధవారం ఎస్పీ పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలీస్ భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. పోలింగ్ సిబ్బంది, ఎన్నికల సామగ్రి సురక్షితంగా కేంద్రాలకు చేరుకోవడంతోపాటు, పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ సామగ్రి స్ట్రాంగ్ రూమ్‌లకు చేరే వరకు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పోలింగ్ ప్రాంతాలను సాధారణ, సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాలుగా విభజించి పరిస్థితులకు అనుగుణంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచడంతోపాటు డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించనున్నారు. అవసరమైన చోట వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పరిశీలించనున్నారు. రూట్ మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్, నాన్ స్ట్రైకింగ్ బలగాలను అందుబాటులో ఉంచి అదనపు ఎస్పీలు, డీఎస్పీ స్థాయి అధికారులు భద్రతను పర్యవేక్షించనున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రత్యేక బృందాలు నిఘా కొనసాగిస్తున్నాయి. అక్రమ మద్యం, నగదు, ఇతర ప్రలోభాల వస్తువుల రవాణాను అడ్డుకునేందుకు వాహన తనిఖీలు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను ముందుగానే గుర్తించి బైండోవర్ చర్యలు చేపట్టినట్లు ఎస్పీ వెల్లడించారు. ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే ఎంతటివారిపైనైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భయంలేకుండా ఓటు వేయండి:ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటిస్తూ ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరిగినా వెంటనే స్థానిక పోలీసులకు లేదా 112 అత్యవసర నంబరుకు సమాచారం అందించాలని సూచించారు.

వి.కోట మండలంలో నేడు ఎన్నికలు

వి.కోట, నవంబర్ 4 ప్రభాతవార్త:

పరిషత్ ఎన్నికలకు సంబంధించి వి.కోట మండలంలో నేడు ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు జరుగుతాయని ఆర్వో పరమేశ్వరన్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆవరణలో ఎన్నికల సామగ్రిని ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేశారు. మండలంలో 25 ఎంపిటిసి స్థానాలకు గాను 54మంది పోటీలో ఉన్నారు. వీరిలో తెదేపా తరపున 23మంది, వైకాపా తరపున 25మంది, జనసేన తరపున 2 మంది ఉన్నారు. మొత్తం 519మంది ఎన్నికల విధులకు హాజరవుతున్నారు. మండలంలో 77 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఐదు సమస్యాత్మకం, పది సున్నితమైన పోలింగ్ కేంద్రాలుగా పోలీసు అధికారులు గుర్తించారు. మొత్తం 100మందికి పైబడి పోలీసులు విధుల్లో ఉంటారని సిఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు.

కార్మికులకు అర్ధరోజు సెలవు ఇవ్వాలి : ఆర్డీఒ

కుప్పం, నవంబర్ 4 ప్రభాతవార్త:

పరిషత్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా రిటర్నింగ్ అధికారి సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గంలో ఉన్న వివిధ పరిశ్రమల యాజమాన్యాలు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు గురువారం అర్ధరోజు సెలవు ఇవ్వాలని కుప్పం ఆర్డీఒ షేక్ మహ్మద్ హుస్సేన్ ఆదేశించారు. కార్మికులు కూడా తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేందుకు పరిశ్రమల యజమానులు, నిర్వాహకులు అర్ధరోజు సెలవు ప్రకటించాలని సూచించారు.

ప్రశాంత పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు

- జడ్పీటిసీ, ఎంపిటిసీ ఎన్నికల పోలింగ్‌కు పోలీసు యంత్రాంగం సిద్ధం
- సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలు- ఎస్పీ తుషార్ డూడి

చిత్తూరు, నవంబర్ 4 ప్రభాతవార్త: జిల్లా వ్యాప్తంగా గురువారం జరుగనున్న జడ్పీటిసీ, ఎంపిటిసీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించడానికి పోలీసు శాఖ అవసరమైన అన్ని చర్యలు పక్కాగా తీసుకుందని ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించ కునేలా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. గత ఎన్నికల అనుభవాలు, స్థానిక పరిస్థితుల ఆధారంగా సున్నితమైన, అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ అదనపు భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. రూట్ మొబైల్ పోలీస్ బృందాలు నిరంతరం పర్యటించేలా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించడానికి స్ట్రైకింగ్ ఫోర్స్, నాన్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లను సిద్ధంగా వుంచామన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో డ్రోన్లు, సిసి కెమెరాల ద్వారా పరిస్థితులను పర్యవేక్షించడంతో పాటు శాంతిభద్రతలకు విఘా తం కల్పించే అవకాశం వున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటికే గుర్తించిన సమస్యాత్మక వ్యక్తులపై ముందస్తు బైండోవర్ చర్యలు తీసుకుంటున్నామన్నారు. అడిషనల్ ఎస్పీలు, డిఎస్పీలు, ఇతర పోలీస్ అధికారులు తమ పరిధిలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రభావితం చేసేందుకు అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీ చేసే ప్రయత్నాలను అడ్డుకోవడానికి ప్రత్యేక తనిఖీ లు నిర్వహిస్తు న్నామన్నారు. చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు, ఇతర కీలక ప్రాంతాల్లో వాహన తనిఖీలను ముమ్మ రంగా చేపట్టామని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించే వారిపై ఓటర్లను బెదిరించే లేదా ప్రలో భాలకు గురి చేసే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరిం చారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది పూర్తి అప్రమత్తతో, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా చట్టం ప్రకారం వ్యవహరిం చాలని, పోలింగ్ ప్రారంభం నుండి ముగింపు వరకు ఎన్నికల సామాగ్రి సురక్షితంగా తిరిగి వచ్చే వరకు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పోలీసులను ఎస్పీ ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన సత్వరం స్థానిక పోలీసులు లేదా పోలీసు అత్యవసర సేవల నెంబర్ 112కు సమాచారం అందించాలని ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు.

వి.కోట మండలంలో నేడు ఎన్నికలు

వి.కోట, నవంబర్ 4 ప్రభాతవార్త:

పరిషత్ ఎన్నికలకు సంబంధించి వి.కోట మండలంలో నేడు ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు జరుగుతాయని ఆర్వో పరమేశ్వరన్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఆవరణలో ఎన్నికల సామగ్రిని ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేశారు. మండలంలో 25 ఎంపిటిసి స్థానాలకు గాను 54మంది పోటీలో ఉన్నారు. వీరిలో తెదేపా తరపున 23మంది, వైకాపా తరపున 25మంది, జనసేన తరపున 2 మంది ఉన్నారు. మొత్తం 519మంది ఎన్నికల విధులకు హాజరవుతున్నారు. మండలంలో 77 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఐదు సమస్యాత్మకం, పది సున్నితమైన పోలింగ్ కేంద్రాలుగా పోలీసు అధికారులు గుర్తించారు. మొత్తం 100మందికి పైబడి పోలీసులు విధుల్లో ఉంటారని సిఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు.

కార్మికులకు అర్ధరోజు సెలవు ఇవ్వాలి : ఆర్డీఒ

కుప్పం, నవంబర్ 4 ప్రభాతవార్త:

పరిషత్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా రిటర్నింగ్ అధికారి సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గంలో ఉన్న వివిధ పరిశ్రమల యాజమాన్యాలు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు గురువారం అర్ధరోజు సెలవు ఇవ్వాలని కుప్పం ఆర్డీఒ షేక్ మహ్మద్ హుస్సేన్ ఆదేశించారు. కార్మికులు కూడా తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేందుకు పరిశ్రమల యజమానులు, నిర్వాహకులు అర్ధరోజు సెలవు ప్రకటించాలని సూచించారు.

నిత్యాన్నదానానికి కర్నాటక భక్తుడు రూ.2లక్షల విరాళం

శ్రీకాళహస్తి,నవంబర్ 4 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నఉంచి విశేష స్పందన లభిస్తుంది. ఉమ్మడి రాష్ట్రం నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్నాటక,తమిళనాడుల నుంచి కూడా భక్తులు విరాళాలు అందిస్తున్నారు.ఈ నేపధ్యంలో బుధవారం కర్నాటకక చెందిన ఓ భక్తుడు నిత్యాన్నదాన పథకానికి రూ.2లక్షల విరాళం అందించారు. శ్రీకా

5CTR 3:5CTR 3.qxd 11/4/2026 11:37 PM Page 1

తిరుపతి డివిజన్

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోబస్తు

-ఎస్పీ ఆదేశాలతో భారీ భద్రతా ఏర్పాట్లు

పుత్తూరురూరల్, నవంబరు 4 ప్రభాతవార్త:

నేడు జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా జిల్లా వ్యాప్తంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగాపోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాలు, ఎన్నికల సామగ్రి రవాణా మార్గాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ క్రైమ్ ఎస్పీ శ్రీలత మాట్లాడుతూ పుత్తూరు పరిధిలోని ఏడు సెగ్మెంట్లకు సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ నుంచి పోలింగ్ ప్రక్రియ ముగిసే, తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లను చేరుకునే వరకు నిరంతర పోలీసు భద్రత కల్పించనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఎస్‌డీపీవో రవికుమార్ మాట్లాడుతూ సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు నిఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. పుత్తూరు సీఐ నెత్తి కంటయ్య మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం పంపిణీ, నగదు రవాణా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియలో ఎవరైనా శాంతి భద్రతలపై భంగం కలిగించేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించుకోవాలని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేశారు. ఎస్ఐ నాగేంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా, అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ఇందు కోసం 100, 112 నంబర్లకు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చని తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని ఎస్ఐ స్పష్టం చేశారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సామగ్రి

పుత్తూరురూరల్, నవంబరు 4 ప్రభాతవార్త:

స్థానిక ఎన్నికల్లో భాగంగా గురువారం ఎంపీటీసీ, జడ్పీటీసీ సంబంధించి పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలకు బుధవారం ఎన్నికల సామర్థ్యం తరలించినట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలో ఏడు ఎంపీటీసీ స్థానాలు సంబంధించి 23 పోలింగ్ బూతులు ఏర్పాటు చేశామని, ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

అంతర్జాతీయ స్థాయి పోటీలకు పలువురు విద్యార్థుల ఎంపిక

రేణిగుంట, నవంబరు 4 ప్రభాతవార్త:

జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రైన్‌బో గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించిన 23వ సబ్‌జూనియర్ జాతీయ స్థాయి జంప్‌రోప్ ఛాంపియన్‌షిప్ 2026-27 పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి పలు పతకాలను కైవసం చేసుకున్నారు. అంతేకాకుండా ప్రతిభ ఆధారంగా అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు విశేష గుర్తింపు తీసుకొచ్చారు.బాలికల విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని కె. ప్రణవి రజత, కాంస్య పతకాలు సాధించగా, అదే తరగతికి చెందిన కె. దీప్తి హనీ రజత పతకాన్ని దక్కించుకుంది. ఏడో తరగతి విద్యార్థిని కరుణ్య రజత పతకం సాధించింది. ఎనిమిదో తరగతి విద్యార్థినులు కె. కీర్తి, కె. దీపాన్విత కాంస్య పతకాలను గెలుచుకున్నారు.బాలుర విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థి ఎస్లీ నక్షత్ర, దీక్షి త్, తొమ్మిదో తరగతి విద్యార్థి రిహాన్ కాంస్య పతకాలు సాధించి తమ సత్తా చాటారు.జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించడంతో పాటు అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. ఈ విజయానికి విశేషంగా కృషి చేసిన కోచ్ రెడ్డికుమార్‌ను ప్రశంసించింది. విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపింది.విద్యార్థుల పట్టుదల, కోచ్ అందించిన శిక్షణ, తల్లిదండ్రుల ప్రోత్సాహం కలగలిపి ఈ విజయాన్ని సాధించేందుకు దోహదపడ్డాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. భవిష్యత్తులోనూ విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షి స్తూ విజేతలందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేసింది.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం!

-రెండు జోన్లు...ఎనిమిది రూట్లుగా పోలింగ్ కేంద్రాల విభజన

రేణిగుంట, అక్టోబర్ 4 ప్రభాతవార్త:

రేణిగుంట మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. పోలింగ్ ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా జరిగేలా అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇందులో భాగంగా రేణిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని ప్రత్యేక వాహనాల ద్వారా భద్రత నడుమ తరలించారు. ఎన్నికల ఏర్పాట్లను అధికారులు దగ్గరుండి పర్యవేక్షి ంచారు. రేణిగుంట మండలాన్ని రెండు జోన్లు, ఎనిమిది రూట్లుగా విభజించి పోలింగ్ నిర్వహణకు ప్రణాళిక రూపొందించారు. మొదటి జోన్‌లో ఒకటి నుంచి 35వ పోలింగ్ కేంద్రం వరకు, రెండో జోన్‌లో 36 నుంచి 76వ పోలింగ్ కేంద్రం వరకు ఏర్పాటు చేశారు. మొదటి రూట్‌లో మామండూరు, దొడ్లమెట్ట, శ్రీనివాసపురం, కరకంబాడి2, ఆర్. అగ్రహారం గ్రామాలు ఉన్నాయి. రెండో రూట్‌లో కరకంబాడి1, తారకరామానగర్, వెంకటాపురం, అన్నసంపల్లె గ్రామాలను చేర్చారు. మూడో రూట్‌లో రేణిగుంట, వేణుగోపాలపురంలోని 20 పోలింగ్ కేంద్రాలు, నాలుగో రూట్‌లో గురవరాజుపల్లి, గుత్తివారిపల్లి, వెదళ్లచెరువు గ్రామాలు ఉన్నాయి. ఐదో రూట్‌లో ఆర్. మల్లవరం, సుబ్బయ్య గుంట, కృష్ణాపురం, ఎల్.ఎన్. కండ్రిగ, శ్రీనివాస ఉదాసీపురం గ్రామాలు, ఆరో రూట్‌లో కొట్రమంగళం, తూకివాకం,సూర్యనారాయణపురం, ఎస్.ఆర్. పట్టేడ, ఎర్రంరెడ్డిపాలెం, తండ్లం, విప్పమానుపట్టెడ గ్రామాలు ఉన్నాయి. ఏడో రూట్‌లో జి.పాలెం, కొత్తపాలెం, ఎల్లమండ్యం, తాతయ్యకాలువ గ్రామాలు, ఎనిమిదో రూట్‌లో సూరప్పకశం, అల్లికేశం, అత్తూరు, ములగమూడి, గాజులమండ్యం ఎస్సీ కాలనీ, గాజులమండ్యం తదితర ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రవిచంద్ర, ఉప ఎంపీడీవో ప్రభురావు తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణ కోసం పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బంది కలిపి 433 మందిని నియమించినట్లు వెల్లడించారు. మండల పరిధిలో మొత్తం 62,579 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. వీరిలో 29,795 మంది పురుషులు, 32,551 మంది మహిళలు, 3 ఇతర ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా

ఎన్నికల పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్

-తిరుపతి కలెక్టరేట్‌లో ఏర్పాటు

తిరుపతి నవంబర్ 4 ప్రభాతవార్త:

జిల్లాలో జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఎన్నికలకు సంబంధించిన సమాచారం, ఫిర్యాదులు, సమస్యలను స్వీకరించి అవసరమైన చర్యలు తీసుకునే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎన్నికల సమయంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తినా, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరిగినా ప్రజలు కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించవచ్చు. కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్: 08772236007 ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా యంత్రాంగం కోరింది.

వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని...

తనిఖీ చేసిన వైద్యాధికారి

పులిచెర్ల, నవంబర్ 4 ప్రభాతవార్త:

పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాపిరెడ్డిగారిపల్లె, మంగళంపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్ సెషన్ పాయింట్లను సందర్శించి టీకాల పంపిణీ, సంబంధిత రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు.మైక్రోప్లాన్, లబ్ధిదారుల జాబితా, వ్యాక్సినేషన్ రిజిస్టర్, మాతా శిశు సంరక్షణ కార్డులు, యూవిన్ పోర్టల్‌లో నమోదు వివరాలను తనిఖీ చేశారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, అర్హులైన చిన్నారులు, గర్భిణులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి చిన్నారికి సంపూర్ణ టీకాలు అందించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. రేపు పోలింగ్ బూత్‌ల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసి ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం, సిబ్బంది రోహిణి, సుబ్బలక్ష్మి, జరీనా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. 1

ప్రశాంత వాతావరణంలో...

ఓటు హక్కు వినియోగించుకోవాలి సీఐ

పులిచెర్ల,నవంబర్ 4 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో, డీఎస్పీ జె. వెంకటనారాయణ సూచనలతో కల్లూరు సర్కిల్ పరిధిలోని పులిచెర్ల, రొంపిచెర్ల, ఐరాల మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.కల్లూరు సర్కిల్ హెడ్ క్వార్టర్స్‌లో సీఐ జి. ప్రసాదరావు, కల్లూరు ఎస్సై సి. వెంకటసుబ్బయ్య, రొంపిచెర్ల ఎస్ఐ మధుసుధన్ పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలీసులు కోరారు.ఎన్నికల నేపథ్యంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163, 144 సీఆర్‌పీసీ, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నాయని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద, రోడ్లపై ప్రజలు గుంపులుగా గుమికూడరాదని హెచ్చరించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రాజకీయ నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల సరంజామాతో అధికారుల పయనం

చంద్రగిరి, నవంబర్ 4 ప్రభాతవార్త:

ఎన్నికల విధుల్లో భాగంగా అధికారులు తగిన సరంజామ తీసుకుని బయలుదేరినట్లు చంద్రగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి శైలజ తెలిపారు. స్థానిక సంస్థల (జడ్పీటిసి, ఎంపిటిసి) ఎన్నికలు గురువారం జరుగనున్న నేపథ్యంలో బుధవారం అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులతో బయలుదేరివెళ్ళారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెళ్ళడించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించు కోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు తెలియజేయ డానికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుల కొరకు 0877-2236007 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

కైలాసధామంకు నవీన్ వితరణ

చంద్రగిరి, నవంబర్ 4 ప్రభాతవార్త:

చంద్రగిరిలో ప్రతిష్టాత్మకంగా నిర్మితమవు తున్న కైలాసధామంకు రెడ్డివారిపల్లికి చెందిన నవీన్ బుధవారం రూ.50 వేలు వితరణ చేశారు. కైలాసధామం కొరకు దాతల నుండి విరివిగా విరాళాలు అందుతున్నాయి. నరశింగాపురంకు చెందిన వెంకటముని రెడ్డి చొరవతో స్పందించిన నవీన్ తన తాత దివంగత సి.రామచంద్రయ్య జ్ఞాపకార్థం రూ.50 వేలు డిడి రూపంలో అందజేశారు. ఈ డిడిని వెంకటముని రెడ్డి కైలాసధామం కమిటీ చైర్మన్ వీరంగారి రమేష్ రెడ్డి, ట్రెజరర్ ఓంకార్ భరత్‌రాజ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌కు, వెంకటముని రెడ్డిలకు వారు ఎంఎల్ఏ పులివర్తి నాని తరపున, కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యకర జీవనశైలే సుస్థిర భవిష్యత్తుకు పునాది

శ్రీకాళహస్తి, అక్టోబర్ 4 ప్రభాతవార్త:

ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, ఉద్యోగం, సమాజం అన్నీ సంతోషంగా ఉంటాయని, అందుకే ప్రతి ఒక్కరూ సుస్థిరమైన ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని తేజేశ్వరి పిలుపునిచ్చారు. బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో గ్యారేజ్ నందు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిపో మేనేజర్ ఎం. రేవతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, గ్యారేజ్ సూపర్వైజర్లు, సిబ్బంది, అసోసియేషన్ లీడర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తేజేశ్వరి మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ అనేది కేవలం మందులు వాడటం కాదని, రోజువారీ అలవాట్లలోనే దాగి ఉందని తెలిపారు. సమతుల్య పోషకాహారం తీసుకోవడం, సరైన సమయానికి భోజనం చేయడం, అధిక నూనె, ఉప్పు, చక్కెరకు దూరంగా ఉండటం, తగినంత నీరు తాగడం, నిద్ర, వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని వివరించారు. ముఖ్యంగా ఆహార వృథాను నివారించడం గురించి ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. అవసరానికి మించి వండటం, ప్లేట్లో ఆహారం వదిలేయడం వల్ల కేవలం డబ్బు వృథా మాత్రమే కాదని, పర్యావరణానికి కూడా హాని జరుగుతుందని, కాబట్టి అవసరమైనంత మాత్రమే తీసుకోవాలని, మిగిలిన ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబిస్తామని, ఆహారాన్ని వృథా చేయమని, పోషకాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటామని సిబ్బంది అందరితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం సిబ్బందిలో ఆరోగ్యంపై నూతన అవగాహన కల్పించిందని డిపో మేనేజర్ ఎం. రేవతి తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిపో సూపర్వైజర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి, ఐక్యత, క్రమశిక్షణ మార్గదర్శకం ఎన్.సి.సి

శ్రీకాళహస్తి, నవంబర్ 4 ప్రభాతవార్త:

ఎన్.సి.సి అంటే కేవలం యూనిఫాం కాదు, అది దేశభక్తి, ఐక్యత, క్రమశిక్షణకు ప్రతీక అని, ఎన్.సి.సి ద్వారా యువత తమ భవిష్యత్తును ఉజ్వలంగా నిర్మించుకోవాలని కళాశాల ఎన్.సి.సి అధికారి డి. భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం ఎస్.వి.ఎ. ప్రభుత్వ కళాశాల, శ్రీకాళహస్తిలో ఎన్.సి.సి క్యాడెట్లకు శిక్షణ డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరిన నూతన విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో భాస్కర్ మాట్లాడుతూ ఎన్.సి.సి ద్వారా విద్యార్థులు బాధ్యతగల పౌరులుగా, దేశానికి ఉపయోగపడే ఉత్తమ నాయకులుగా తయారవుతారని తెలిపారు. క్యాడెట్లు క్రమశిక్షణతో మెలిగి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎన్.సి.సి వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, శారీరక దృఢత్వం, సేవాభావం, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యత పెరుగుతాయని, అంతేకాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిగ్రీలో చేరిన నూతన విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్ నిర్వహించి అర్హత సాధించిన వారికి ఎన్.సి.సి లో ప్రవేశం కల్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిలోని 29 బెటాలియన్‌కు చెందిన ఎన్.సి.సి అధికారులు మురళి, మధు కళాశాల ఎన్.సి.సి క్యాడెట్లు పాల్గొన్నారు.

చియ్యవరంలో టీడీపీ నేత వరదయ్య మృతి

తొట్టంబేడు, నవంబర్ 4 ప్రభాతవార్త:

తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వయ్యవూరు వరదయ్య ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలియగానే గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి తన సతీమణి రిషిత రెడ్డితో కలిసి చియ్యవరం గ్రామానికి చేరుకుని వరదయ్య భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిం చారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ వరదయ్య ఆకస్మిక మరణం తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. పార్టీ కోసం, గ్రామ అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. వరదయ్య కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని, ముఖ్యంగా ఆయన బిడ్డల చదువు బాధ్యతను పూర్తిగా తాను తీసుకుంటానని హామీ ఇచ్చి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఆయనతోపాటు టిడిపి నాయకులు ఉన్నారు

చట్టంపై అవగాహన ఉంటేనే నేరాలు తగ్గుతాయి

శ్రీకాళహస్తి,నవంబర్ 4 ప్రభాతవార్త:

భారతదేశంలో ప్రతి ఏటా నవంబర్ 9న జాతీయ న్యాయ సేవా దినోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో నవంబర్ 2 నుండి 10 వరకు దేశవ్యాప్తంగా న్యాయ సేవా అధికార సంస్థల ఆధ్వర్యంలో న్యాయ అవగాహన వారోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శ్రీకాళహస్తిలోని లోబావి గిరిజన కాలనీలో అవగాహన ర్యాలీ, న్యాయ విజ్ఞాన సదస్సు ఘనంగా నిర్వహించారు. న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికిపాటి రమేష్, శ్రీరామ్ ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజన ప్రాంత ప్రజలకు దేశంలోని వివిధ చట్టాలు, వారికి ఉన్న ప్రాథమిక న్యాయ హక్కులపై విస్తృత అవగాహన కల్పించారు. నిరుపేదలకు కోర్టు ద్వారా ఉచితంగా న్యాయ సహాయం ఏ విధంగా లభిస్తుందో వివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది రాజేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. చట్టాలపై స్పష్టత ఉంటే నేరాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందన్నారు. గ్రామాల్లో, విద్యా సంస్థల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు. కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలు ఉన్న బాధితులు న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదిస్తే ఉచితంగా న్యాయ సహాయం పొందే వీలుందని పేర్కొన్నారు. క్షణికావేశంలో కేసులు పెట్టుకుని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని, రాజీపడాల నుకునే వారు లోక్ అదాలత్ వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా కోర్టు ద్వారా నియమించబడిన పారా లీగల్ వాలంటీర్ల ద్వారా వాటిని కోర్టు దృష్టికి తీసుకువస్తే తగిన పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ బాబాఫరీద్ స్థానిక ప్రజలు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సూళ్ళూరుపేట డివిజన్

చిరంజీవి సేవా సంఘం వారిచే గర్భిణీ స్త్రీకి రక్తదానం

సూళ్ళూరుపేట, నవంబర్ 4 ప్రభాతవార్త : సూళ్ళూరుపేటలోని మెగాస్టార్ చిరంజీవి సేవా సంఘం వారిచే గర్భిణీ స్త్రీకి రక్తదానం చేసిన వసంతం బుధవారం సూళ్ళూరుపేటలో చోటుచేసుకుంది. నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న చేనుగుంట గ్రామానికి చెందిన గర్భిణీ స్త్రీకి ఏ పాజిటివ్ రక్తం అవసరమని ఆమె తరఫున బంధువులు మెగాస్టార్ చిరంజీవి సేవా సంఘం వారిని సంప్రదించారు. ఎందుకు స్పందించిన మెగాస్టార్ చిరంజీవి సేవా సంఘం అధ్యక్షుడు మా భాష సంఘంకు చెందిన ఈశ్వర్, సంతోష్ లను సంప్రదించి వారు నెల్లూరుకు వెళ్లి రక్తదానం చేసే విధంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మా భాష మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి అందజేసిన స్ఫూర్తితోనే తాము పనిచేస్తున్నామని తెలిపారు. రక్తదానం చేసిన దాతలను పలువురు అభినందించారు.

షార్ మాజీ ఉద్యోగులకు జీవన ప్రమాణ పత్రాలు

సూళ్ళూరుపేట, నవంబర్ 4 ప్రభాతవార్త : శ్రీహరి కోటలో ఉద్యోగులుగా పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు శ్రీహరికోట రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో బుధవారం జీవన ప్రమాణ పత్రాలను నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఇందులో భాగంగా రిటైర్డ్ పెన్షనర్లకు, ఫ్యామిలీ పెన్షన్లకు సంస్థ కార్యాలయంలోనే స్వచ్ఛందంగా జీవన పత్రాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటి వరకు 255 మందికి జీవన పత్రాల నమోదు ప్రక్రియను పూర్తి చేసినట్లు వారు తెలిపారు. ఇందుకు సంబంధించి బ్యాంకు నుంచి రెండు మూడు రోజుల్లో నిర్ధారణ పత్రాలు వస్తాయని చెప్పారు. ఈ నమోదు కార్యక్రమం నవంబర్ 5,6,14,15 తేదీలలో నిర్వహించబడుతుంది. ఈ సౌకర్యాన్ని పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీహరికోట రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ వారు కోరారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

దొరవారిసత్రం, నవంబర్ 4 ప్రభాతవార్త: దొరవారిసత్రం మండలంలోని 10 ఎంపీటీసీ సెగ్మెంట్లు, ఒక జడ్పీటిసి స్థానానికి ఎన్నికలు జరుగుతున్నాయని మండలంలోని 28,435 ఓట్లు 35 బూతులు నాలుగు రూట్లుగా ఏర్పాటు చేశామని ఎన్నికల అధికారులు తెలిపారు. మండలంలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాటు చేశామని ఎవరైనా ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై జీవి చౌదరి తెలిపారు.

ఆగడాలను సహించం...కట్టుదిట్టమైన బందోబస్తు

-ఆందోళన అవసరం లేదు: డివైయస్పి

శ్రీకాళహస్తి,నవంబర్ 4 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలంలో గురువారం జరుగనున్న స్థానిక ఎన్నికలకు కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు శ్రీకాళహస్తి డివిజన్ పోలీసు అధికారి పావని బుధవారం తెలిపారు. ఆమె ప్రభాతవార్తతో మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసారు. ఆందోళన వ్యక్తం చేసిన జిల్లా ప్రాదేశిక సభ్యుడు ఉన్నం వాసుదేవనాయుడుతో చర్చించి భరోసా ఇచ్చామన్నారు.ఎన్నికలు సజావుగా నిర్వహించటానికి ప్రత్యేక పోలీసు బృందాలను కూడా రప్పించినట్లు పావని తెలిపారు.ఇప్పటికే పోలీసు సిబ్బందిని పోలింగ్‌స్టేషన్ల వద్దకు పంపినట్లు వివరించారు.అంతేకాక మండలంలోని 43 పోలింగ్‌కేంద్రాలకు బ్యాలెట్‌బాక్సులు చేరాయని అక్కడకు బిఎల్‌ఓలు, పోలీసు సిబ్బంది చేరుకున్నారని డివైయస్పి వివరించారు.మండలంలోని 15 మంది ఎస్ఐలు, నలుగురు సిఐలు వీరుక ఆకుండా నాలుగు స్ట్రైకింగ్ ఫోర్సులున్నాయన్నారు. తొట్టంబేడు మండలంలో వంద మంది కానిస్టేబుల్స్‌ను బందోబస్తు నియమించినట్లు తెలిపారు. ఇక బుధవారం రాత్రికే వంద మీటర్ల దూరం నిబంధనలను పాటించుటకు సంబంధించి ఆదేశించామన్నారు. ఎపోలింగ్‌బూత్‌ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. చుట్టుపక్కల రాళ్ళు కర్రలు లేకుండా ముందుజాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని తమ సిబ్బందికి ఆదేశించినట్లు డివైయస్పి వివరించారు.అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు.ఇప్పటికే గతంలో గొడవలకు దిగిన వారికి నోటీసులు జారి చేసినట్లు వివరించారు.

టపాకాయల దుకాణాల ఏర్పాటుకు పరిశీలన

శ్రీకాళహస్తి,నవంబర్ 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో ప్రజలకు ఇబ్బంది లేకుండా టపాకాయల దుకాణాలను ఏర్పాటుకు అధికారులు పరిశీలించారు.గత ఏడాది నుంచి వివాదాస్పదంగా మారిన శ్రీకాళహస్తి ఆర్‌టిసి బస్టాండుకు సమీపంలోని జూనియర్ కళాశాల ఆవరణలో దుకాణాల ఏర్పాటుకు సంబంధించి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, కమిషనర్ కృష్ణారెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి దుకాణం దారులను ఇక్కడ మీకు ఎవరు షాపులు ఏర్పాటుకు అనుమతించారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వ్యాపారులు సమాధానం చెబుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి అయ్యలనాడు చెరువులో ఏర్పాటు చేసుకునేవారమని తరువాత ఇక్కడ జూనియర్ కళాశాల వచ్చిందన్నారు. ఇక్కడ భద్రత దృష్ట్యా ఈ సారి రెండు స్థలాలను పరిశీలించినట్లు ఆర్‌డిఓ వివరించారు. వ్యాపారానికి మరో రెండు రోజులుంటే అధికారులు విద్యాప్రకాశానంద డిగ్రీ కళాశాల ఆవరణ లేదా మార్కెటింగ్ కమిటి ఆవరణలో ఏర్పాటుకు సూచించినట్లు వివరించారు.ప్రజల భద్రతే లక్ష్యమని, టపాకాయల దుకాణాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని ఆర్‌డిఓ వివరించారు.

కార్తీక మాసం సందర్భంగా... పర్యాటకశాఖ ప్రత్యేక ప్యాకేజీ టూర్లు

-డిఎం శ్రీనివాసరావు

తిరుపతి,నవంబర్ 4ప్రభాతవార్త: పవిత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రత్యేక దర్శన ప్యాకేజీ టూర్లను ఏర్పాటు చేసినట్లు తిరుపతి డివిజనల్ మేనేజర్ సి.హెచ్. శ్రీనివాసరావు తెలిపారు. ఒంటిమిట్ట, అహోబిలం, మహానంది, శ్రీశైలం పుణ్యక్షేత్రాల సందర్శన ఉంటుంది. ఈ యాత్ర ఈనెల 14నుండి 21వరకు ,తిరిగి 28 నుండి డిసెంబర్ 5వతేదీ వరకు (కార్తీక మాసంలోని ప్రతి శనివారం) ఉదయం 6 గంటలకు తిరుపతి నుండి బస్సు బయలుదేరుతుంది. ఒంటిమిట్ట, అహోబిలం, మహానంది, శ్రీశైలం క్షేత్రాల దర్శనం అనంతరం తిరిగి సోమవారం ఉదయానికి బస్సు తిరుపతి చేరుకుంటుంది. పెద్దలకు 3,500 రూపాయలు, పిల్లలకు (3 నుండి 10 సంవత్సరాల లోపు) 2,800 రూపాయలు టిక్కెట్‌దరగా నిర్ణయించారు. శబరిమల యాత్రలు, వివాహాలు ఇతర శుభకార్యాలు/యాత్రల కొరకు 36 సీట్ల నాన్‌ఏసీ హైటెక్ బస్సులు, 45 సీట్ల ఏసీ వోల్వో మల్టీయాక్సిల్ బస్సులు అద్దెకు ఇవ్వబడును.అవసరమైన వాళ్ళు శ్రీనివాసం కాంప్లెక్స్, తిరుపతి,విష్ణునివాసం కాంప్లెక్స్ (టీటీడీ), తిరుపతి గానీ 08772289123, 9848007033, 9848802099, 9848850099 నంబర్లకు సంప్రదించాలి.

ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలకు పోలింగ్‌కు సర్వం సిద్ధం

బాలాయపల్లి, నవంబర్ 4 ప్రభాతవార్త: మండలంలోని ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికల పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి ఆర్.శోభన్ బాబు తెలిపారు. 35 పోలింగ్ కేంద్రాలకు, ఎన్నికల సామాగ్రిని సిద్ధం చేయడంతో పాటు పిఓలు, ఏపిఓలను, ఇద్దరు ఏఆర్ఓలను మొత్తం 185ని పోలింగ్ సిబ్బందిగా విధుల్లో నియమించినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు 144 సెక్షన్ ఏర్పాటు ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాల ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవచ్చునన్నారు. మండలంలో 27 వేల 708 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. 13474 మంది పురుషులు, 14 234 మంది స్త్రీలు ఉన్నట్లు వివరించారు. నవంబర్ 5వ పోటింగ్, 7న కౌంటింగ్ ఉంటుందన్నారు.

ఎంపీటీసీ-జడ్పిటిసి ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

వెంకటగిరి, నవంబర్ 4 ప్రభాతవార్త: మండలంలోని ఎనిమిది ఎంపీటీసీలు ఒక జడ్పిటిసి స్థానానికి ఈ నెల 5వ తేదీ జరగబోవు పోలింగ్‌కు ఏర్పాట్లు అన్ని పూర్తి చేసినట్లు ఆర్వో శ్రీహరి తెలిపారు. మండలంలో 26 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ నిర్వహణ పర్యవేక్షణకు నాలుగు రూట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఓటు ఉన్న వారందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 26 పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శిరీష, ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శారద దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

వెంకటగిరి, నవంబర్ 4 ప్రభాతవార్త: మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎంపికైన దొంతు శారద దంపతులను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. చైర్ పర్సన్‌గా గెలిచిన శారద రామకృష్ణను కలిసి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే శారద దంపతులను సత్కరించారు. భారీ మెజార్టీతో గెలిచారని అభినందనలు తెలిపారు. సతీమణి గెలుపుకు బాలకృష్ణ ఎంతగానో కృషి చేశారు. పోలేరమ్మ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణ, మాజీ ఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి

సూళ్ళూరుపేట, నవంబర్ 4 ప్రభాతవార్త: సూళ్ళూరుపేటలోని బాలికల హై స్కూల్‌లో విద్యార్థినులకు పెడుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పి. సంయుక్త బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆమె వంటగదిని పరిశీలించి స్టాక్ వివరాలను తెలుసుకొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆమె విద్యార్థులను ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనాన్ని ఇస్తున్నారా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. వంట వారికి పలు సూచనలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని పెట్టాలని అన్నారు. అలాగే హై స్కూల్‌కు సరఫరా చేస్తున్న కోడిగుడ్లు, బియ్యం ఇతర వస్తువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎల్ గణపతి, శ్రీ చక్రవర్తి, ఎల్ చలపతి తదితరులు ఉన్నారు.

ప్రసాదాల నాణ్యతకే పెద్దపీట

-టిటిడి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి: నీరు,ఆహారం తనిఖీ చేసే అనాలసిస్ ల్యాబ్ ను దేశంలోనే ఆదర్శవంతంగా నిలిచేలా అభివృద్ధి చేస్తున్నట్లు టిటిడి అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. ఈ ల్యాబ్‌లో ప్రసాదాల నాణ్యతకే ప్రాధాన్యత అన్నారు. టిటిడికి అవసరమైన ఆహార పదార్థాల కొనుగోలు దశ నుండే నాణ్యత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అదనపు ఈవో తెలిపారు. ఎఫ్ఎస్ఎస్ఎఐ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన సిబ్బందితో నమూనాలను సేకరించి పరీక్షించిన అనంతరమే నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న పదార్థాలను కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. బుధవారం ఆయుధపూజ జరిగింది.

ప్రజలకు సేవకులుగా పనిచేయండి

-ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్

పుత్తూరు, నవంబరు 4 ప్రభాతవార్త : ప్రజలకు సేవకులుగా పనిచేయాలని స్థానిక ఎన్నికల్లో పుత్తూరు, నగరి మునిసిపల్ ఛైర్మన్లుగా ఎన్నికైన డి.ఎన్.ఏలుమలై (అమ్ములు), ఇ.ఎన్.శ్రీనివాసన్‌కు ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ సూచించారు. బుధవారం ఇరువురు ఛైర్మన్లు ఎమ్మెల్యేను కలిసి తమకు ఛైర్మన్‌లుగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేసి, పూలమాల, శాలువాతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థంగా అమలవుతుండడంతో కూటమి పార్టీలకు ప్రజాదరణ లభిస్తోందని జరిగిన ఎన్నికలు రుజువు చేస్తున్నాయని పేర్కొన్నారు. గెలిచిన మునిసిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు అధికార దర్పంతో కాకుండా సేవా దృక్పథంతో ప్రజలకు సేవ చేయాలని ఉద్బోధించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు మునిసిపల్ సాధారణ నిధులను సక్రమంగా వినియోగించుకుంటూ ఆయా మునిసిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

ప్రజాసేవలో కొనసాగుతా : జయప్రకాశ్

పుత్తూరు, నవంబరు 4 ప్రభాతవార్త : ప్రజలకు ఎల్లపుడూ అందుబాటులో వుంటూ ప్రజాసేవలో కొనసాగుతానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పుత్తూరు మునిసిపల్ ఛైర్మన్‌గా పోటీ చేసిన డి.జయప్రకాశ్ (చిట్టి) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో అపజయం సంభవించినప్పటికీ 10,152 ఓట్లు వేసి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై చూపించిన ఆదరాభిమా నాలను ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సాధారణమని, ఇకపై కూడా తాను ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

వార్డు ప్రజలకు రుణపడి ఉంటా

-ప్రజల విశ్వాసంతోనే తన విజయం -కార్పొరేటర్ హేమంత్‌కుమార్

తిరుపతి,నవంబర్ 4ప్రభాతవార్త: తనపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించిన వార్డు ప్రజలకు రుణపడి ఉంటానని తిరుపతిలో 22వ వార్డు కార్పొరేటర్ ఇ.హేమంత్‌కుమార్ యాదవ్ తెలిపారు. తన విజయం టిడిపి పట్ల ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 22వ డివిజన్ నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఇ.హేమంత్ కుమార్ యాదవ్ విజయం సాధించారు. అత్యంత క్లిష్టమైన రాజకీయ పోరులో 369 ఓట్ల మెజారిటీతో గెలిచారు. రాజకీయంగా ప్రాధాన్యత ఉన్న 22వ వార్డులో వైసిపి తరపున పోటీ చేసిన జల్లి తులసిపై ఆయన గెలిచారు. అంతేగాక వైసిపి తరపున మేయర్ అభ్యర్థిగా పోటీచేసిన వై. వాసుదేవయాదవ్ సొంత వార్డు కావడం విశేషం. ఈ క్లిష్టమైన పరిస్థితుల్లోనూ ప్రజల మద్దతుతో 369 ఓట్ల మెజారిటీ సాధించడం హేమంత్ కుమార్ యాదవ్ నాయకత్వ సామర్థ్యానికి, ప్రజల్లో ఆయనకున్న ఆదరణకు నిదర్శనం.

తిరుపతిలో బిజెపి బలోపేతానికి... కార్పొరేటర్ల విజయమే నిదర్శనం

తిరుపతి,నవంబర్ 4ప్రభాతవార్త: తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు 44వ డివిజన్ కార్పొరేటర్ కరుణాకర్ రెడ్డి, 52వ డివిజన్ కార్పొరేటర్ జి.పృథ్వి రెడ్డి, 62వ డివిజన్ కార్పొరేటర్ పార్థసారథి విజయం సాధించడం పట్ల బిజెపి సీనియర్ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆయన ఆధ్వర్యంలో ముగ్గురు నూతన కార్పొరేటర్లను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గుండాల గోపీనాథ్ మాట్లాడుతూ తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో తొలిసారిగా ముగ్గురు

బిజెపి కార్పొరేటర్లు విజయం సాధించడం పార్టీకి చారిత్రాత్మక ఘట్టమన్నారు. నగరంలో తమ పార్టీ బలపడుతోందనే విషయానికి ఈ ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ నగర అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని నూతన కార్పొరేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, మల్లారపు రవి ప్రసాద్, తులసిరామ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వేదికపై ఎస్వీయూ పరిశోధనా ప్రతిభ

తిరుపతి విద్య,నవంబర్ 4 ప్రభాతవార్త: ఆప్టికల్ ఫైబర్ కమ్యూనికేషన్ రంగంలో భవిష్యత్ సాంకేతికతలకు ఉపయోగపడే పరిశోధనతో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర ప్రొఫెసర్ బి. దేవప్రసాద్ రాజు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం హ్యూస్టన్‌లో నిర్వహిస్తున్న ఏడో అంతర్జాతీయ ఆప్టిక్స్, ఫోటానిక్స్, లేజర్స్ సదస్సులో ఆయన తన పరిశోధనా పత్రాన్ని సమర్పించి ప్రసంగించారు.నవంబర్ 2 నుంచి 4 వరకు హ్యూస్టన్‌లోని షెరటాన్ నార్త్ హ్యూస్టన్ హోటల్‌లో యునైటెడ్ సైంటిఫిక్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతోంది. ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు ఇందులో పాల్గొంటున్నారు. ఈ వేదికపై ప్రొఫెసర్ దేవప్రసాద్ రాజు ఎర్బియం డోప్డ్ బోరోటెల్యురైట్ గ్లాసుల కాంతి ఉద్గార లక్షణాలు, గెయిన్ క్రాస్ సెక్షన్ ప్రొఫైల్స్‌పై తన అధ్యయనాన్ని వివరించారు.సీబ్యాండ్ టెలికమ్యూనికేషన్ వ్యవస్థల్లో ఈ గ్లాసుల వినియోగ సామర్థ్యాన్ని విశ్లేషించడం ఆయన పరిశోధనలో కీలక అంశం. సాధారణంగా ఆప్టికల్ ఫైబర్ ద్వారా సమాచార ప్రసారంలో సిగ్నల్ సామర్థం, దూరం, వేగం వంటి అంశాలకు ప్రాధాన్యం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎర్బియం ఆధారిత ప్రత్యేక గ్లాసుల కాంతి లక్షణాలను అధ్యయనం చేయడం ద్వారా భవిష్యత్ ఆప్టికల్ యాంప్లిఫైయర్ టెక్నాలజీల అభివృద్ధికి అవసరమైన శాస్త్రీయ అంశాలను ఆయన వివరించారు. ఫోటానిక్స్, అధునాతన ఆప్టికల్ కమ్యూనికేషన్ రంగాల్లో ఈ పరిశోధనకు ప్రాధాన్యం ఉంది.అంతర్జాతీయ సదస్సులో ఎస్వీయూ అధ్యాపకుడు తన పరిశోధనను ప్రదర్శించడం విశ్వవిద్యాలయ పరిశోధనా సామర్థ్యానికి గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భంగా ఎస్వీయూ ఉపకులపతి, రిజిస్ట్రార్, కళాశాల ప్రిన్సిపాల్, పలువురు అధ్యాపకులు ప్రొఫెసర్ బి. దేవప్రసాద్ రాజును అభినందించారు. అంతర్జాతీయ పరిశోధనా వేదికల్లో విశ్వవిద్యాలయ అధ్యాపకులు భాగస్వాములు కావడం విద్యాసంస్థ ప్రతిష్ఠను మరింత పెంచుతుందని పేర్కొన్నారు.

పల్లె పోరులో ప్రతీకారం తప్పదా !

కుప్పంలో ఎంపీటీసీ.. జడ్పిటిసి స్థానాలపై తెదేపా గురి

కుప్పం, నవంబర్ 4 ప్రభాతవార్త: సీఎం చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గం కుప్పం లోని ఎంపీటీసీ, జడ్పిటిసి సెగ్మెంట్ లపై అధికార తెలుగుదేశం పార్టీ గురి పెట్టింది . నియోజకవర్గంలో 68 ఎంపిటిసి సెగ్మెంట్లు, 4 జడ్పిటిసి సెగ్మెంట్లు ఉన్నాయి. వీటిలో ఇప్పటికే రామకుప్పం మండలంలో 14 ఎంపీటీసీ సెగ్మెంట్లను తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. మిగతా 54 ఎంపీటీసీ సెగ్మెంట్లతో పాటు కుప్పం, గుడిపల్లి, రామకుప్పం, శాంతిపురం మండలాల్లోని జడ్పిటిసి స్థానాలను ఖచ్చితంగా గెలుచుకోవాలని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ప్రచారాన్ని కొనసాగించారు. 2021 వ సంవత్సరంలో కుప్పంలో జరిగిన ఎంపిటిసి ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ 64 ఎంపీటీసీ సెగ్మెంట్లను దక్కించుకుంది. అలాగే నాలుగు మండలాల్లో జడ్పిటిసి స్థానాలను సైతం గెలుచుకుంది. 2021 స్థానిక సంస్థల ఎన్నికలను అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బహిష్కరించారు. అయితే అప్పటికే నామినేషన్లు దాఖలు చేసిన ముగ్గురు మంది తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఎంపిటిసిలుగా గెలిచారు .ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలను అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పార్టీకి గ్రామీణ ప్రాంతాల్లో బలమైన కేడర్ ఉండటంతో పాటు కార్యకర్తలు సైతం అధికంగా ఉండడంతో సీఎం చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి వాటిని ఓట్ల రూపంలో సాధించాలని తెలుగుదేశం పార్టీ శ్రేణులు వ్యూహరచన చేశాయి. మరోపక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం ఎంపీటీసీ సెగ్మెంట్లలో తమ అభ్యర్థులను బరిలో నిలిపింది. పలు సెగ్మెంట్లలో తమ పార్టీ సైతం బలంగా పోటీ ఇస్తుందని వైకాపా నాయకులు పేర్కొంటున్నారు .అయితే సీఎం చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో గత రెండున్నర ఏళ్లగా చేపట్టిన అభివృద్ధి ,గ్రామాల్లో మోలిక వసతులు, కుప్పానికి కృష్ణాజల లాల రాక తదితరాలు తెలుగుదేశం పార్టీకి బాగా కలిసి వస్తాయని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. కుప్పంలో జరుగుతున్న స్థానిక పోరు లో ఘనవిజయం సాధించాలనే ధ్యేయంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు పనిచేశాయి. ఐదేళ్ల నాటి ఎన్నికలకు సంబంధించి ఈసారి తెలుగుదేశం పార్టీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఫలితాల్లో ప్రతీకారం తీర్చుకుంటుందని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

5 CTR 5:5 CTR 5.qxd 11/4/2026 11:38 PM Page 1

ఫలితాలలో మేటి శ్రీ వశిష్ట డిగ్రీ కళాశాల

-వీసీ నరసింహారాజు

రైల్వేకోడూరు రూరల్, నవంబర్ 4 ప్రభాతవార్త:

ఫలితాలలో మేటిగా ఉంటూ క్రమశిక్షణకు మారుపేరుగా శ్రీ వశిష్ట డిగ్రీ కళాశాల వెలుగొందుతుందని త్రిపుర బుద్ధిస్ట్ వైస్ ఛాన్సలర్ నరసింహారాజు అన్నారు. రైల్వే కోడూరు మండలంలో బుధవారం శ్రీ వశిష్ట డిగ్రీ కళాశాల 21వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసింహారాజు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా రైల్వే కోడూరు మండలంలో డిగ్రీ కళాశాలలో చక్కటి విద్యతో పాటు ఫలితాలను సాధించడంలో శ్రీ వశిష్ట డిగ్రీ కళాశాల ఎంతో ఉన్నత స్థాయిలో ఉన్నదని ఆయన అన్నారు. ప్రారంభించిన అనతి కాలంలోనే అత్యుత్తమ ఫలితాలతో ఎటువంటి ప్రచార ఆర్భాటాలు లేకుండా చక్కటి ఫలితాలు పొందుతూ యూనివర్సిటీలోనే బెస్ట్ కాలేజీ గా శ్రీ వశిష్ట డిగ్రీ కళాశాల వెలుగొందుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో మొదటి సెమిస్టర్, రెండవ సెమిస్టర్ ఫలితాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు,తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత విద్యను అభ్యసించి కళాశాలకు,తల్లిదండ్రులకు మంచి పేరు సాధించారని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిబ్బాల నారాయణ వర్మ, శ్రీరాములు, ప్రభాకర్, రేవతి తో పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు!

చిట్వేలి, నవంబర్ 4 ప్రభాతవార్త:

గురువారం జరగనున్న స్థానిక ఎన్నికలు దృష్ట్యా చిట్వేలి మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై వినోద్ కుమార్ అన్నారు. సజావుగా ఎన్నికలు జరిగేందుకు ఒక సీఐ, ముగ్గురు ఎస్ఐలు, సుమారు 200 మంది సిబ్బందితో ప్రతి పోలింగ్ బూత్ వద్ద పూర్తిస్థాయిలో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంపులుగా ఉండడం, గొడవలకు దిగడం, రిగ్గింగ్‌కు పాల్పడడం, దొంగ ఓట్లు వేసేందుకు సాహసించడం లాంటి చర్యలకు ఉపక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని, తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేసే హక్కు ప్రతి పౌరుడికి ఉన్నదని అన్నారు. ప్రతి ఓటరు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఏదైనా ఇబ్బంది జరిగితే వెంటనే తమను సంప్రదించవచ్చని తెలిపారు. అన్ని పార్టీల రాజకీయ నాయకులు స్థానిక ఎన్నికలను సజావుగా జరిగేందుకు సహకరించాలని ఎస్సై వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

అవగాహనతోనే రొమ్ము క్యాన్సర్‌ను ఎదుర్కోవచ్చు

తిరుపతి విద్య, నవంబర్ 4 ప్రభాతవార్త:

మహిళల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్న రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం, సరైన సమయంలో చికిత్స పొందడం ఎంతో కీలకమని నిపుణులు సూచించారు. వ్యాధిపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, శరీరంలో కనిపించే అసాధారణ మార్పులను నిరక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని తెలిపారు.శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం హోమ్ సైన్స్ విభాగం, మోహన్ బాబు యూనివర్సిటీ ఫార్మసీ విభాగం సంయుక్తంగా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించాయి. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. భీమన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రొమ్ము క్యాన్సర్‌కు దారితీసే కారణాలు, వ్యాధి లక్షణాలు, ముందస్తుగా గుర్తించే పద్ధతులు, వైద్య పరీక్షలు, అందుబాటులో ఉన్న చికిత్స విధానాలపై విద్యార్థినులకు వివరించారు. వ్యాధి ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స పొందే అవకాశాలు మెరుగుపడతాయని, మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అవగాహన కల్పించారు. విద్యార్థినుల్లో ఆరోగ్య సంబంధిత అంశాలపై చైతన్యం పెంపొందించడంతో పాటు, ఈ సమాచారాన్ని కుటుంబ సభ్యులు, ఇతర మహిళలకు చేరవేయాల్సిన అవసరాన్ని కార్యక్రమం ద్వారా వివరించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మహిళల్లో ఆరోగ్య స్పృహ పెంచేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సాయికుమారి, హోమ్ సైన్స్ విభాగాధిపతి డా. వి.లక్ష్మి, అధ్యాపకులు డా. శ్రీవాణి, డా.చెంచులక్ష్మి, డా. ఉమారాణి, డా. వాణి, మోహన్ బాబు యూనివర్సిటీ ఫార్మసీ విభాగం అధ్యాపకురాలు డా. వి. హేమలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళా ఐటీ ఉద్యోగుల జీవన సమతుల్యతపై పరిశోధన

తిరుపతి విద్య, నవంబర్ 4 ప్రభాతవార్త : ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ జీవనం మధ్య సమతుల్యత సాధించడంలో మహిళా ఐటీ నిపుణులు ఎదుర్కొంటున్న సవాళ్లపై ఎం.బి. జ్యోతి చేసిన పరిశోధనకు గుర్తింపుగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో ఆమె పీహెచ్‌డీ పరిశోధన పూర్తి చేశారు.బెంగళూరు నగరంలోని మహిళా ఐటీ నిపుణుల పని, వ్యక్తిగత జీవన సమతుల్యతపై ఆమె పరిశోధన సాగింది. వృత్తిపరమైన ఒత్తిడి, కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత జీవితంపై ఉద్యోగ ప్రభావం తదితర అంశాలను విశ్లేషించారు. ఈ అంశంపై నిర్వహించిన మౌఖిక పరిశోధన పరీక్షలో ప్రతిభ కనబరిచారు.ప్రొఫెసర్లు ఆర్. శివరామ్ ప్రసాద్, పి. మోహన్ రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, డి.వి. రమణల సమక్షంలో ఆమె డాక్టరేట్‌కు అర్హత సాధించారు. ఈ పరిశోధనకు ప్రొఫెసర్ డి.వి. రమణ ప్రధాన పర్యవేక్షకుడిగా ప్రొఫెసర్ పి.రఘునాథరెడ్డి సహ పర్యవేక్షకుడిగా వ్యవహరించారు. జ్యోతిని కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

పద్మావతిలో ఇద్దరికి డాక్టరేట్లు ప్రదానం

తిరుపతి,నవంబర్ 4ప్రభాతవార్త: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పరిశోధకురాలు సి. శిల్పజా ఫార్మా న్యూటికల్ సైన్సెస్‌లో డాక్టరేట్ పట్టా పొందారు. విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, ఫార్మాస్యూటిక్స్ విభాగానికి చెందిన ఆచార్య వై. ఇందిరా ముజిబ్ మార్గదర్శకత్వంలో ఆమె డిజైన్, డెవలప్‌మెంట్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ నానోబేస్డ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ ఫర్ న్యూరోడీజెనరేటివ్ డిజార్డర్స్ యాజ్ ఇంట్రానాసల్ నానోపార్టిక్యులేట్ సిస్టమ్స్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు. న్యూరోడీజెనరేటివ్ వ్యాధుల చికిత్సలో మెరుగైన ఫలితాలను సాధించే లక్ష్యంతో, ముక్కు ద్వారా మెదడుకు ఔషధాలను నేరుగా చేరవేసే నానో ఆధారిత ఔషధ పంపిణీ వ్యవస్థల రూపకల్పన, అభివృద్ధి, లక్షణ నిర్ధారణ, సమర్థతపై ఆమె పరిశోధన సాగింది. ముఖ్యంగా మెదడుకు ఔషధాలను సమర్థవంతంగా చేరవేసే వినూత్న ఇంట్రానాసల్ నానో డ్రగ్ డెలివరీ విధానాల అభివృద్ధిపై ఆమె ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆమె పరిశోధనలో భాగంగా ఒక పేటెంట్‌ను పొందడంతో బాటు, రెండు పరిశోధనా వ్యాసాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో ప్రచురించారు. ఈ పరిశోధనకు గుర్తింపుగా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సి. శిల్పజాకు ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టాను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా పరిశోధకురాలు సి. శిల్పజాను ఆమె పరిశోధనా మార్గదర్శి ప్రొఫెసర్ వై. ఇందిరా ముజిబ్, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, సహచర పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

ఓటరు మహాశయా.. నీ నిర్ణయం ఎటు..?

పార్టీలకు పట్టం కడతారా... ప్రలోభాలకు తలొగ్గుతారా!

చిట్వేలి, నవంబర్ 4 ప్రభాతవార్త: చిట్వేలి మండలంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు స్థానిక ఎన్నికల్లో ఆసక్తికర వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారం ముగిసి పోలింగ్‌కు రంగం సిద్ధమైన వేళ ఓటరు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పార్టీల పట్ల విధేయతకు ఓటర్ల పట్టం కడతారా, లేక అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, ప్రలోభాలకు ప్రాధాన్యత ఇస్తారా, అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చగా మారింది. అభ్యర్థుల్లోనూ గెలుపోటములపై అంతర్మథనం మొదలైంది. మండలంలో అధికార కూటమి పార్టీలు ఏకగ్రీవాల దిశగా అడుగులు వేయడంలో విఫలమయ్యాయి. కూటమి పెద్దలు ఒకే తాటిపై నడవకపోవడం, స్థానికంగా నెలకొన్న రాజకీయ విభేదాలు, టికెట్ల కేటాయింపులో అసంతృప్తులు ఎన్నికల పోరును మరింత ఆసక్తికరంగా మార్చాయి. 12 ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానానికి కూడా పోటీ అనివార్యమైంది. దీంతో ప్రతి గ్రామంలోనూ రాజకీయ వేడి పెరిగింది. అయితే స్థానిక ఎన్నికల్లో పార్టీ బలంతో పాటు అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, గ్రామస్థాయి సంబంధాలు, సామాజిక సమీకరణాలు, ఓటర్లను ప్రభావితం చేసే అంశాలు కూడా కీలకంగా మారనున్నాయి. దీంతో ఎవరి ఓటు ఎటువైపు మళ్లుతుందన్నది అంచనా వేయడం కష్టసాధ్యంగా మారింది. బుధవారం కూటమి పెద్దలు సమావేశమై జనసేన అభ్యర్థికి మద్దతు ప్రకటించినప్పటికీ, ఆ ప్రకటన కేవలం నామమాత్రపు చర్యగానే మిగిలిందన్న విమర్శలు మండలంలో వినిపిస్తున్నాయి. మొత్తంగా చిట్వేలి మండలంలో ఎన్నికల పోరు పార్టీ ప్రతిష్టకు, అభ్యర్థుల వ్యక్తిగత బలానికి మధ్య జరిగే పోరుగా మారింది.

చదువుతోపాటు ఉద్యోగ లక్ష్యాలపైనే లక్ష్యం

-పద్మావతి కళాశాలలో 500 మంది విద్యార్థినులకు కెరీర్ అవగాహన

తిరుపతి విద్య, నవంబర్ 4 ప్రభాత వార్త: ఇంటర్మీడియట్ చదువు తున్నప్పుడే భవిష్యత్ ప్రణాళికపై స్పష్టత ఉంటే ఉన్నత విద్య, ఉద్యోగ రంగాల్లో సరైన దిశలో అడుగులు వేయవచ్చనే ఉద్దేశంతో టీటీడీ శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినుల ఆసక్తులు, సామర్థ్యాలను గుర్తించి తగిన కెరీర్‌ను ఎంచుకునేలా మార్గనిర్దేశం చేశారు. బుధవారం కళాశాల ప్రిన్సిపల్ డా. సి. భువనేశ్వరి అధ్యక్షతన మూడు సెషన్లుగా జరిగిన వర్క్‌షాప్‌లో ఎంఈసీ, బైపీసీ, కామర్స్ విభాగాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ బ్యూరో డిప్యూటీ చీఫ్ టి. శ్రీనివాసులు విద్యార్థినులతో నేరుగా సంభాషిస్తూ వారి భవిష్యత్తు అభిరుచులను తెలుసుకునేందుకు ప్రత్యేక పరీక్ష నిర్వహించారు. వ్యక్తిగత ఆసక్తులకు అనుగుణంగా భవిష్యత్‌లో ఎలాంటి కోర్సులు ఎంచుకోవాలి, ఉపాధి అవకాశాలను ఎలా అన్వేషించాలనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా రోటేరియన్లు ఎం. శ్రీకాంత్ రెడ్డి, డా. కె. నాగేంద్ర కుమార్, ప్రొఫెసర్ ఎం.సి. రెడ్డెప్ప రెడ్డి, మహీధర్ రెడ్డి, సాయికుమార్ విద్యార్థినులకు ప్రోత్సాహం అందించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ బృందం కార్యక్రమాన్ని సమన్వయం చేయగా, డా. జయమ్మ వందన సమర్పణ చేశారు. జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది.

నైపుణ్యాలే భవిష్యత్‌కు బాటలు

-రిమ్స్‌లో నూతన విద్యార్థులకు కెరీర్ దిశానిర్దేశం

తిరుపతి విద్య, నవంబర్ 4 ప్రభాత వార్త: ఉన్నత విద్యను అభ్యసించే సమయంలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుంటే మెరుగైన కెరీర్ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ (రిమ్స్) ప్రిన్సిపల్ డా. జె. ప్రకాశ్ రెడ్డి సూచించారు. కళాశాలలో నూతనంగా ప్రవేశించిన ఎంసీఏ, ఎంబీఏ, ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్) విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవడం ఎంత ముఖ్యమో, వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయడం కూడా అంతే అవసరమన్నారు. ఎంచుకున్న కోర్సులపై పూర్తి స్థాయిలో పట్టు సాధించడంతోపాటు, ప్రస్తుత పోటీ ప్రపంచానికి అవసరమైన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని సూచించారు. తరగతి గది బోధనతోపాటు స్వీయ అధ్యయనం, ఆచరణాత్మక పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సీనియర్లు, జూనియర్లు పరస్పర సహకారంతో మెలుగుతూ కళాశాలలో ఆరోగ్యకరమైన విద్యా వాతావరణాన్ని పెంపొందించాలని చెప్పారు.విద్యార్థులు చదువుతోపాటు మంచి నడవడిక, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు. సమాజంలో ఆదర్శవంతమైన వ్యక్తులుగా ఎదుగుతూ తమ ప్రతిభతో రిమ్స్ విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జీవితంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ప్రిన్సిపల్ డా. ప్రకాశ్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో రిమ్స్ యాజమాన్య ప్రతినిధులు వై. ఆనందారెడ్డి, వై. విజయ్ రెడ్డి, హెచ్ఓడీలు డా. నిరంజన్ రెడ్డి, డా. మధుర, అధ్యాపకులు, నూతనంగా ప్రవేశించిన విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థినికి హాస్టల్ వసతి కల్పించాలి

-ఎస్వీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్‌కు స్టూడెంట్స్ జేఏసీ వినతి

తిరుపతి విద్య, నవంబర్ 4 ప్రభాతవార్త: ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాల నుంచి తిరుపతికి వచ్చే పేద, గ్రామీణ విద్యార్థినులకు వసతి సమస్య ఎదురుకాకుండా శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొందిన ప్రతి ఒక్కరికీ హాస్టల్ సౌకర్యం కల్పించాలని స్టూడెంట్స్ జేఏసీ డిమాండ్ చేసింది. ప్రైవేటు హాస్టళ్లలో అధిక అద్దెలు చెల్లించలేక ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రతినిధులు తెలిపారు. వసతి ఖర్చుల భారం కారణంగా కొందరు విద్యార్థినులు చదువుపై దృష్టి సారించలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు.శ్రీ పద్మావతి అమ్మవారి పేరుతో కొనసాగుతున్న మహిళా విద్యాసంస్థలో విద్యార్థినుల భద్రత, సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు. కళాశాలకు అనుబంధంగా ఉన్న హాస్టళ్లలో సీట్లు సరిపోకపోతే అదనపు వసతి భవనాలు లేదా ఇతర ప్రత్యామ్నాయ సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఇతర జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు.హాస్టళ్లలో సీసీటీవీ కెమెరాలు, మహిళా వార్డెన్లు, తగిన భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయడంతోపాటు నాణ్యమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పర్యవేక్షణ ఉండాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన సమానత్వం, వ్యక్తిగత గౌరవం వంటి విలువలకు అనుగుణంగా పేద విద్యార్థినులకు నాణ్యమైన విద్యతోపాటు సురక్షితమైన వసతి అందించాల్సిన బాధ్యత విద్యాసంస్థపై ఉందని పేర్కొన్నారు.ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎస్వీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్‌కు స్టూడెంట్స్ జేఏసీ ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం అధ్యక్షురాలు వినుత వాల్మీకి, భారతీయ దళిత విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు యుగంధర్, బీజేఆర్ఎస్ఎఫ్‌కు చెందిన అర్జున్, బీఎస్ఎఫ్‌కు చెందిన కృష్ణ, ఎన్ఏఎస్‌యూ నాయకుడు శివకుమార్, నాగార్జున, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్లలో తిరగండి.. ప్రజా సమస్యలు పరిష్కరించండి

-కొత్త కార్పొరేటర్లకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సూచన

తిరుపతి విద్య, నవంబర్ 4 ప్రభాతవార్త: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తూ, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లకు సూచించారు. డివిజన్లలో నిత్యం పర్యటిస్తూ ప్రజలతో మమేకం కావాలని, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని పిలుపునిచ్చారు.బుధవారం జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల నుంచి నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. కార్పొరేటర్ పదవి కేవలం రాజకీయ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి అవసరాలకు స్పందించాల్సిన బాధ్యత కూడా ఉందని సూచించారు. ప్రజలతో పాటు ప్రభుత్వ అధికారులతోనూ మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ విజయాన్ని బాధ్యతగా భావించి డివిజన్ల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. పారిశుద్ధ్య, స్థానిక మౌలిక సదుపాయాలు, ప్రజలకు ఎదురయ్యే రోజువారీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వాటి పరిష్కారానికి ముందుండాలని సూచించారు. సమర్థవంతమైన ప్రజాసేవతో పార్టీలకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆరణి జగన్, ఊకా విజయ్ కుమార్, క్రికెట్ విజయ్, స్వతంత్ర కార్పొరేటర్ దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి,శెట్టిపల్లి బాలా, రామకృష్ణ, చరణ్, పార్థసారథి, సునీల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు

7 నుండి 20వ వరకు

టిటిడి విశ్రాంత ఉద్యోగులకు శ్రీవారి లడ్డూ, వడ ప్రసాదం

తిరుమల,నవంబర్ 4ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి బ్రహ్మోత్సవాల అనంతరం టిటిడి విశ్రాంత ఉద్యోగులకు, కుటుంబ పింఛన్‌దార్లకు అందించే శ్రీవారి లడ్డూ, వడ ప్రసాదాన్ని ఈనెల 7 నుండి 20వ తేదీ వరకు అందించనున్నారు. తిరుపతిలోని టిటిడి క్యాంటీన్ వద్ద కొత్త జాబిలి భవనంలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రసాదాలు పంపిణీ చేస్తారు. పింఛన్‌దార్లు తమ స్మార్ట్ కార్డు చూపి ఒక పెద్ద లడ్డూ, ఒక వడ పొందవచ్చు. పిపిఓ నంబర్ల వారీగా ప్రసాదాల పంపిణీ జరుగుతుంది. నవంబరు 7న 164 నుండి 3,250 వరకు, నవంబరు 9 నుండి 13వ తేదీ వరకు 3,251 నుండి 9,050 వరకు, నవంబరు 16 నుండి 19వ తేదీ వరకు 9,051 నుండి 12,550 వరకు, నవంబరు 20న 12,551 నుండి మిగిలిన పింఛన్‌దారులందరికీ ప్రసాదాలు అందిస్తారు. విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ పింఛన్‌దారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీవారి ప్రసాదాలను

తిరుపతి డివిజన్

మా బంగారు నగలను మాకు ఇప్పించండి సారూ!

- బాధితుడు విమల్ కుమార్ విజ్ఞప్తి

తిరుపతి హెల్త్, నవంబర్ 4 ప్రభాతవార్త: తిరుపతి పంట వీధిలో నివాసముంటున్న విమల్ కుమార్ తన అవసరాల కోసం కొర్లగుంట బ్రాంచ్ కేఎల్ఎం యాక్సోవా గోల్డ్ లోన్ ప్రైవేట్ లిమిటెడ్ నందు 189 గ్రాములు బంగారు నగలు బ్యాంకు నందు తాకట్టుపెట్టి, అదనంగా బ్యాంకు మేనేజర్ శాంతి కుమార్ 100 గ్రాములు బంగారు తన ఖాతాలో పెట్టించుకుని రేపు అకౌంట్లో అమౌంట్ వేస్తామని చెప్పినారని, అమౌంట్ వేయపోవడంతో బ్యాంకు దగ్గరకు వెళ్లి చూడగా బ్యాంకులో దొంగతనం జరిగిందని బ్యాంకు వారు బాధితుడైన విమల్ కుమార్ కు చెప్పారన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో విమల్ కుమార్ తన భార్య అర్చనతో కలిసి మాట్లాడారు. బాధితుడు విమల్ కుమార్ మాట్లాడుతూ జరిగిన విషయంపై పోలీస్ కంప్లేట్ ఇస్తే, పోలీస్ వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. గత నాలుగు సంవత్సరాలుగా కాలయాపన చేస్తూ బ్యాంకు చుట్టూ మమ్మలను తిప్పించుకుంటున్నారని, సంబంధిత అధికారులు తమ నగలు తాముకు ఇప్పించి,వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కరకంబాడి నందు ఇదే బ్యాంకు బ్రాంచ్‌లో ఇలాగే దొంగతనం జరిగితే మూసివేసారని, వీళ్లు కొర్లగుంట బ్రాంచ్‌ని కూడా మూసివేసి కంపెనీ ఎత్తేస్తే మా పరిస్థితి ఏంటి అని వాపోయారు. తమ బంగారే కాకుండా బంధువుల దగ్గర కొంతమేర బంగారు తెచ్చి తాకట్టు పెట్టామన్నారు. తమకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని వాళ్ళని చదివించుకోవడం కోసం, చిన్నపాటి ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నామని, అవసరానికి తాకట్టు పెట్టిన నగలు డబ్బు కట్టి తీసుకుందామంటే బ్యాంకు సిబ్బంది తమని ఇబ్బంది పెడుతున్నారని,తమ నగలు తమకు ఇప్పించాలని సంబంధిత అధికారులను వేడుకున్నారు.

గ్రామ స్వరాజ్యం టిడిపితోనే సాధ్యం

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహ యాదవ్ విజ్ఞప్తి

తిరుపతి హెల్త్, నవంబర్ 4 ప్రభాతవార్త: నేడు జడ్పిటిసి,ఎంపీటీసీ ఎన్నికలలో భాగంగా టిడిపి ఎన్డిఏ కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎన్డీఏ కూటమి పని చేస్తుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరసింహ యాదవ్ మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, రోడ్లు నిర్మాణం, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ కూటమి ఎన్డిఏ ప్రభుత్వం గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా పనిచేస్తుందని, ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులను ఆదుకుంటూ, గ్రామీణ ప్రాంతాలను కూడా పట్టణ ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. పట్టణ ప్రాంతాల అభివృద్ధి నగరపాలక ఎన్నికల విషయంలో అందరూ ఊహించిన విధంగా ఎన్డీఏ, టిడిపి, జనసేన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ముఖ్యమంత్రి వర్షాభావ ప్రాంతాలలో పర్యటిస్తూ రాష్ట్ర అభివృద్ధి, రాష్ట్ర ప్రజల కోసం ప్రజల వెంట ఉండి వారి బాగోగులు చూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల కోసం 34 శాతం రిజర్వేషన్ ఇస్తూ టిడిపి ముందుకెళితే, బీసీలకు అన్యాయం చేసే విధంగా వైసిపి జగన్మోహన్‌రెడ్డి ఏ విధంగా ఉక్కు పాదం మోపారో, కోర్టుకు వెళ్లి అణగారిన వర్గాలకు ఏ విధంగా ఇబ్బంది పెట్టారో? చూసామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 48 శాతం వెనుకబడిన వర్గాలకు సీట్లు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయ